మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## నేటి నుంచి అమల్లోకి నూతన చట్టాలు : సిపి అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం నేరన్యాయ చట్టాలు 2023 జూలై 1 నుంచి అమలులోకి రానున్నట్లు సీపీ డా॥అనురాధ తెలిపారు. అదివారం అమె మాట్లాడుతూ ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. నూతన చట్టాలపై పోలీసు అధికారులకు, సిబ్బందికి నెల రోజుల పాటు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సీఐలు కమలాకర్, శ్రీధర్, ముత్యం రాజు, జానకిరామ్‌రెడ్డి, ఎస్ఐలు నరేందర్‌రెడ్డి, అపూర్వరెడ్డి, చంద్రమోహన్, మధుకర్‌రెడ్డిలు పోలీసు అధికారులకు, సిబ్బందికి శిక్షాణ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. అమల్లోకి రానున్న కొత్త చట్టాలు దేశ అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయని వివరించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్దతులలో మారు ప్రవస్తుందన్నారు. ప్రజలకి మరింత సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు.పోలీసు అధికారులు, సిబ్బంది నూతన చట్టాలపై ప్రజలు అవగాహన కల్పించాలన్నారు.

## గంజాయి మత్తులో భక్తులపై దాడి : ఇద్దరికి గాయాలు

**కొమురవెల్లి, జూన్ 30, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి అలయానికి వచ్చే భక్తులపైన కొ ందరు యువకులు గంజాయి, మద్యం తాగి దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. హైదారాబాద్‌కు చెందిన కొందరూ యువకులు శనివారం రాత్రి కొమురవెల్లి స్వామి వారి దర్శనానికి వచ్చారు. అక్కడ ప్రపంచ కప్ టీ 20లో భారత్ విజయం సాధించడంతో హైదారాబాద్‌కు చెందిన భక్తులు సంతోషం వ్యక్తం చేస్తూ రోడ్డుపైన మాట్లాడుతూ బస చేయడానికి రూముల కోసం తిరుగుతున్న సమయంలో కొమురవెల్లికి చెందిన కొంత మంది యువకులు గంజాయి మద్యం మత్తులో అకారణంగా యువకులపై విచక్షణారహితంగా కర్రలు, బైక్ షాక్ అబ్జలుతో దాడి చేయడంతో హైదారాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులకు తీవ్రంగా గాయాలయా ్యయి. వారిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అనంతరం దాడి చేసిన యువకులను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసు నమోదు చేస్తామని చేర్యాల సీఐ శీను తెలిపారు. కాగా సిఐ శీను మాట్లాడుతూ కొమురవెల్లిలో నిరంతరం పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తులపై దాడి చేసిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పరిశ్రమల్లో ప్రమాదాలపై నిర్లక్ష్యం వీడని అధికారులు

### గాలిలో కలిసిపోతున్న కార్మికుల జీవితాలు హత్నూర మండలంలో ఘటనలు

**హత్నూర జూన్ 30, ప్రభాతవార్త:** హత్నూర మండలంలో వివిద గ్రామాల పరిధిలోగల పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల జీవితాలు గాలిలో దీపంలా మరాయి. ఈసంవత్సరం జనవరి నుండి జూన్‌నెల మధ్య హత్నూర మండలం బోర్పట్ల, గుండ్లమాచునూర్,చందాపూర్ గ్రామా పరిధిలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న 13 మంది కార్మికులు,ఉద్యోగులు మృతి చెందారు. నెలల వ్యవధిలో ప్రమాదాలు జరుగుతున్న సంబంధిత అధికారులుకానీ, యాజమాన్యంకాని నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి.కార్మికుల రక్షణకు తీసుకోవాల్సి న చర్యల విషయంలో అయా యాజమాన్యాలు నిర్లక్ష్యం మూలంగానే కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని బాదితుల కుటుంబాల సభ్యులు ఆరోపిస్తున్నారు. హత్నూర మండలం బోర్పట్ల గ్రామం పరిధిలోని ఎపిటోరియా పరిశ్రమంలో పనిచేస్తున్న పచ్చిమబెంగాల్ బరండి గ్రామానికి చెందిన హరిపాండ అనే కార్మికులుడు గతజనవరి 16న,అదేనెల 30న బోర్పట్ల గ్రామానికి చెందిన కె.నర్సింలు అనే కార్మికుడు విధులు నిర్వహిస్తూ మృతి చెందారు.గుండ్లమాచునూర్ గ్రామం పరిధిలోని కొవలెంట్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో డిబ్లాక్‌లో మార్చి నెల5న, జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు మృతిచెందారు. అందులో హత్నూర గ్రామానికి చెందిన కెమిస్ట్రి వినోద్ కుమార్,జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన లాల్‌బాబుతూరీ,పాదర్ మారండి,స్వాధీన్ రాజ్‌మాల్‌లు మృతి చెందారు. హత్నూర మండలం పరిధిలోని చందాపూర్ గ్రామం పరిధిలోని ఎస్‌బిఆర్గనిక్స్ పరిశ్రమలో ఎప్రిల్ 3న, జరిగిన రియాక్టం పేలిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఈప్రమాదంలో కంపెని డైరెక్టర్ రవికుమార్‌తో పాటు మరోఐదుమంది మృతి చెందారు.ఈఘటనకు సంబందించి పూర్తిస్థాయి విచారణ చేయడానికి, పటాన్‌చెరువు డిఎస్పీని విచారణ అధికారిగా నియమించారు.ఇప్పటి వరకు దానికి సంబందించి ఇంకా వాచారణ నివేదిక రావల్సి ఉంది.ఇది ఇలా ఉండగా గుండ్లమాచునూర్ గ్రామం పరిధిలోని ఎపిరోరియా ఫార్మకంపెనీలో పనిచేస్తన్న సూర్యపేటజిల్లా, జాజిరెడ్డి గూడెం మండలం,రామన్నగూడెం గ్రామానికి కిమిస్ట్రి కిరణ్,ఈ ఈనెల 26న,విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు.మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ వివిద సంఘాల వారు సంగారెడ్డిలోని మార్చురి వద్ద ఒదోళన చేసిన విషయం తెలిసిందే. పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నప్పుడు జిల్లా అధికారులు హడావుడి చేయడంతప్ప శాశ్వత పరిష్కారం కోరకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరునెలల వ్యవధిలో 13మంది మృతి చెందిన సంబంధిత అధికారుల్లో నిర్లక్ష్యపుమత్తు ఇంకా వీడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


కొవలెంట్ లేబొరేటరీస్ ప్రమాద స్థలంను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)


కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

## మల్లన్న ఆలయం మరింత అభివృద్ధి

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**కొమురవెల్లి, జూన్ 30, ప్రభాతవార్త :** ఎంపి నిధులతో కొమురవెల్లి మల్లన్న సన్నిధిని మరింత అభివృద్ధి చేస్తానని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అదివారం అయన మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శనానికి విచ్చేసిన ఎంపికి అర్చకులు అలయ సంప్రదాయ ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ కొమురవెల్లి అసంపూర్తిగా ఉన్న రైల్వే పనులను త్వరగా పూర్తి చేయడానికి కేంద్ర రైల్వే మంత్రి, అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో కొనసాగుతుందన్నారు. ఎన్నికల సమయంలో నామినేషన్ వేసిన తర్వాత మల్లన్న అలయం గంగరేణి చెట్టు వద్ద ముడుపు కట్టానని మల్లన్న అశీస్సులతో భువనగిరి ఎంపిగా గెలిచానని మొదటి సారిగా ఎంపి హోదాలో స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎంపికి ఘన స్వాగతం పలికారు. అయన వెంట మల్లన్న అలయ పాలక మండలి మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, ఎంపిటిసిలు కవితకనకరాజు, కొయ్యడ రాజమణి శ్రీనివాస్, మద్దూరు జడ్పీటిసి గిరికొండల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి టౌన్, జూన్ 30, ప్రభాతవార్త:** పద్మా అవార్డుల కొరకు అర్హుల నుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. 2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ ఆవార్డులకు నామినేషన్లు ఆహ్వానిస్తూ భారత ప్రభుత్వం హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను విడుదల చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్ట్, సోషల్ ప్రజా వ్యవహారాల, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, వాణిజం, పరిశ్రమ, వైద్యం, సాహిత్యం, విద్య, సివిల్ సర్వీస్, క్రీడలు తదితర కేటగిరీలలో సేవచేసిన వారు వెబ్‌సైట్‌లో జులై 31వ తారీఖు లోపు సంగారెడ్డి జిల్లా వాసులు డిఐఒ ఎన్ఐసి ద్వార సంబంధిత హెచ్ఓడిలకు నామినేషన్లు అందచేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు.

## నిజాం షుగర్ ప్యాక్టరీని పునరుద్దరించాలి

### మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, జూన్ 30, ప్రభాతవార్త:** మంబోజిపల్లిలోని నిజాం షుగర్ ప్యాక్టరిని పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్బంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ నిజాం షుగర్ ఫ్యాక్టరిని తెరిపిస్తామని పొందుర్చారని గుర్తు చేశారు. చక్కర కర్మాగారం కింద 14 మండలాల రైతులు చెరుకును కర్మాగారినికి సరఫరా చేసే వారు ఉన్నారన్నారు. ఆగస్టు మాసం నుంచి పనులు ప్రారంభిస్తే 6 మాసాల్లో ఫ్యాక్టరీ పనులు ముగుస్తాయని, నవంబర్‌లో చెరుకు సీజన్ ప్రారంభం అవుతుందన్నారు. ప్రతి సీజన్‌లో 4 లక్షల టన్నుల చెరుకు కర్మాగారంలో గానుగాడిస్తారని పేర్కొన్నారు. కర్మాగార పున:ప్రారంభానికి అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసి కర్మాగారం ప్రారంభం అయ్యేలా చూడాలని శశిధర్‌రెడ్డి సూచించారు.

## పూర్తయిన పనులు వెంటనే ప్రారంభించండి

### మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్, జూన్30, ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై నాలుగవ తేదీన జడ్పిటిసి,ఎంపిటిసిల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో వారి హయాంలో జరిగిన పనులను వారి పదవులు ఉండగానే ప్రారంభిస్తే ప్రజా ప్రతినిధులుగా వారు మంజూరు చేయించి ప్రారంభించిన పేరు ఉంటుందన్నారు.ఈ విషయంలో స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని వాటిని వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.అంతే కాకుండా ఎన్నికల సమయం కంటే ముందు హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నో అభివృద్ధి పనులను గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయించామని ఈ ప్రాంత ప్రజల సౌకర్యాల నిమిత్తం అట్టి పనులను సైతం రద్దు చేయకుండా అమలు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన అన్ని పనులను మంత్రి వెంటనే ప్రారంభించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ విషయంలో మాజీ శాసనసభ్యునిగా ఎలాంటి సలహాలు, సహకారం కావాలంటే సహకరించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు.

## కారు, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

**హత్నూర జూన్ 30, ప్రభాతవార్త** హత్నూర మండలం తుర్కలఖనాపూర్ గ్రామశివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు.దౌల్తాబాద్ నుండి పటాన్‌చెరు వైపు వెళుతున్న ద్విచక్రవాహనం,పటాన్‌చెరువైపు నుండి దౌల్తాబాద్‌వైపు వెళుతున్న కారు ఎన్‌సిఎల్ పరిశ్రమ సమీపంలోనికి రాగానే ఎదురుగా ఢీకొన్నాయని అన్నారు. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సతీష్‌కు గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు.

# డీఈవో పనితీరు విచ్చిత్రంగా ఉంది

### ఏబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 30, ప్రభాతవార్త ః** మెదక్ జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు డిఈఓను విన్నవించుకుననన చరవాణిల ద్వారా సమాచారం ఇచ్చిన ఎలాంటి స్పందన లేకుండా పోయిందని, డీఈవో పనితీరు దున్నపోతు ప్రవర్తనలా ఉందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్ అన్నారు. డీఈవో పనితీరును నిరసిస్తూ వినూత్నంగా దున్నపోతుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం మొదలై 20 రోజులు నుండి ఒక ప్రభుత్వ పాఠశాలను కూడా సందర్శించి సరైన సదుపాయాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలలో అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలను విక్రయిస్తున్న ఇప్పటివరకు ఒక్క యాజమాన్యం మీద కూడా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. జిల్లా విద్యాధికారి బాధ్యతలో కూర్చుని విద్యారంగానికి సంబంధించిన ఎలాంటి విషయం పటించుకోకుండా ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముగాస్తున్నాడు కాబట్టి అతని యొక్క ప్రవర్తన తీరు, అతని యొక్క పనితీరు దున్నపోతులా....దున్నపోతు మీద వర్షం పడ్డట్టుగా ఉన్నది కాబట్టి ఏబీవీపీ దీన్ని ఖండిస్తూ వినతిపత్రాన్ని దున్నపోతుకు అందజేసి నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. ఈ రోజు ప్రభుత్వం మెగా డీఎస్సీ అని చెప్పి కేవలం 11వేల పోస్టుల భర్తీకి నాందిపలికి మిగతా ఖాళీగా ఉన్న పోస్టులను మరిచిపోయి మావల్లే ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యమైందని ప్రగల్భాలు పలుకుతుందన్నారు. దీనిని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, నాయకులు సంపత్, నగర సంయుక్త కార్యదర్శి ప్రణయ్, భరత్, అరవింద్ ప్రసాద్, దుర్గా ప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.


దున్నపోతుకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

## ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానన్న ఘనత రేవంత్‌రెడ్డిదే

### -పిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండారు శ్రీకాంత్‌రావు

**గజ్వేల్, జూన్ 30 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని పిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్కటి నెరవేరుస్తారన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. రేవంత్‌రెడ్డిపై ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా పనిచేయవని, కాంగ్రెస్ ప్రభుత్వం మరో పదేండ్లు అధికారంలో ఉండడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఇతర పార్టీల నేతలు పెద్దఎత్తున చేరుతున్నారని, రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లేకుండా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గుప్త, అనిల్‌రెడ్డి, భానుప్రకాష్‌రావు, క్యాసారం బాబా తదితరులు పాల్గొన్నారు.

## బంగారు గొలుసు అపహరణ

**నర్సాపూర్ జూన్ 30. ప్రభాతవార్త :** ఒక వ్యక్తి వద్దనుండి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు ఉంగరం అపహరించిన సంఘటన ననార్సపూర్‌పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈసంఘటన వివరాలు ఎస్ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం ఇలా వున్నాయి...... సిద్దిపేటకు చెందిన జలమంచి చిత్తంశర్మ (65) నర్సాపూర్‌లో దశదిన ఖర్మ కార్యక్రమంలో పాల్గొన్నడానికి సిద్దిపేట నుండి నర్సాపూర్ నకు వచ్చాడని తెలిపారు.ఈ క్రమంలో నర్సాపూర్ పట్టణంలో పట్టపగలు ఎవరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు భైక్ పై చిత్తంశర్మ వద్దకు వచ్చి మాటల్లో పెట్టి తన వద్దనున్న బంగారు గొలుసు, ఉంగరం లాక్కొని వెళ్లిపోయారని తెలిపారు.బాధితుడు చిత్తంశర్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాధు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుననట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు.

## ఐదేళ్ళ పాలనలో ప్రజా ప్రతినిధులు అధికారుల సహకారంతో అభివృద్ధి

### చివరి సమావేశంలో అధికారులను సన్మానించిన ఎంపీపీ, జడ్పీటీసీ

**పటాన్‌చెరు,జూన్ 30,ప్రభాతవార్త:** గత ఐదేళ్ల పాలనలో అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజల మౌళిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిర్వహించామని జిన్నారం మండల ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం జిన్నారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో నిర్వహించిన పనుల వివరాలను అభివృద్ధి కార్యక్రమాలను సభలో వివరించారు. అనంతరం ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ఐదేళ్లలో అభివృద్ధికి వివిధ ప్రజా సమస్యలపై సహకరించిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యలపైనే పరస్పర విమర్శలు కానీ మండిపడటం జరిగిందని, అంతేకాని వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదన్నారు. అధికారులు వాటిని మనసులో పెట్టుకోకుండా నిరంతరం ప్రజల సమస్యలపై ముందుకు సాగాలని ఎంపీపీ, జడ్పీటీసీ ప్రభాకర్ పెర్కొన్నారు. అనంతరం అధికారులు మట్లాడుతూ రాజకీయాలకు జిన్నారం మండలం ప్రత్యేకమైన అధికారపక్షమైన ప్రతిపక్షమైన తమకు సహకరించినందు వల్లనే ఉద్యోగులుగా ముందుకు సాగామని, తమ సహకారం ఉండాలని భవిష్యత్తులో ఉన్నత పదవులు అదిరోహించాలని ఎంపీపీ, జడ్పీటీసీలను ఉద్దేశించి మాట్లాడారు. అధికారులను సన్మానించిన ఎంపీపీ రవీందర్‌గౌడ్ మండల సర్వసభ్య సమావేశ అనంతరం మండల స్థాయి అధికారులను, కార్యదర్శిలను ఎంపీటీసీలను ఎంపీపీ రవీందర్‌గౌడ్ శాలువా జ్ఞాపకాలతో సత్కరించారు. జర్నలిస్టులను సైతం శాలువాలతో సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీల్లో జోగిపేట పోలీసులు

**జోగిపేట, జూన్ 30, ప్రభాతవార్త:** జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని అందోలు శివారు జోగిపేట ఎస్ఐ అరున్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంలోనూ వారు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల చట్టాల ప్రకారం అవసరమైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, వాటి గురించి అవగాహన కల్పించేందుకే తనిఖీ చేయటంతోపాటు నిబంధనలకు విరుద్దంగా వాహనాలను నడుపుతున్నవారికి జరిమానాలు విధించటంతోపాటు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతేకాకుండా జులైన 1 నుంచి కొత్తగా భారత న్యాయసంహిత అమలులోకి వస్తున్న సందర్భంలో చట్టాలు మరింత కఠినంగా ఉన్నాయని, వీటిపైకూడా వాహనదారులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు ప్రతినిత్యం నాలుగు వైపులా వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గౌసొద్దిన్, శ్రీనివాస్‌లతోపాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల ఖర్చులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరి

## ఎంపి అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పరిశీలన

**సంగారెడ్డి టౌన్, జూన్ 30, ప్రభాతవార్త:** మే నెలలో జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను ఆదివారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కలెక్టర్ వ్యయాలను జహీరాబాద్ పార్లమెంట్ పరిధి ఎన్నికల వ్యయ పరిశీలకులు మోతిలాల్ షీటే, జిల్లా ఎన్నకల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరులు పరిశీలించారు. ఎన్నికల ఖర్చుల వివరాలను అభ్యర్థులు, అభ్యర్థుల తరపున ప్రతినిధులు, ఏజంట్లు హాజరయినారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు సమర్పించిన వ్యయ రికార్డులు, ఎన్నికల షాడో టీంలు నమోదు చేసిన రికార్డులు సరితూగాలని, వివరాలు సరితూగకుంటే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థులను వచ్చే ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఓ బాలసౌరి, వనయవ పరిశీలన నోడల్ అధికారి అంజయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సాంస్కృతి,సాంప్రదాయాలకు నిలయాలు శిశు మందిర్ పాఠశాలలు

### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

**హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్, జూన్30,ప్రభాతవార్త**

సాంస్కృతి,సాంప్రదాయాలకు నిలయాలు శిశుమందిర్ పాఠశాలలు అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు.ఆదివారం రోజున హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాల నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ రతాలను మంచి మార్గంలో నడిపేం దుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ఈ పాఠశాలలు దోహదపడుతాయన్నారు.రాష్ట్రంలో కార్పోరేట్ పాఠశాలలు వచ్చి ప్రభుత్వ,శిశు మందిర్ పాఠశాలలను చిన్నాబిన్నం చేశాయని పేర్కొన్నారు.తాను కూడా శిశుమందిర్ పాఠశాలలోనే చదువుకున్నానని గుర్తు చేశారు.ఈ పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణే తనను ఈస్థాయికి తీసుకొచ్చిందని గుర్తు చేసుకున్నారు.శిశు మందిర్ పాఠశాలలకు మతం ముద్ర వేసిన పాలకులు నిధులు ఇవ్వకుండా విమర్శించారు.మదర్సాలు,మిషనరీ సంస్థలకు పెద్ద ఎత్తున నిధులు,జీతాలు ఇస్తున్నారన్నారు.దేశ భక్తి,సన సంస్కృతి,సాంప్రదాయాలను కొనసాగిస్తున్న ఏకైక విద్యాసంస్థలు కేవలం శిశుమందిర్ పాఠశాలలు మాత్రమేనని వీటిని ప్రోత్స హించాల్సి న బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.శిశు మందిర్ విద్యార్థిగా క్రమశిక్షణ,న్యాయం, ధర్మం కోసం పోరాటాలు చేస్తే తనపై మొత్తం 109 కేసులు పెట్టారన్నారు.అనంతరం బ్రతుకు బంగారు లోకం అనే పాఠపాడిన బండి సంజయ్ అందరిని అలరించారు.ఈ పాఠశాలను ప్రారంభించిన తనకు చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాపీఠం దక్షణ క్షేత్రం ప్రాంత కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్,హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డితో పాటు శిశు మందిర్ పాఠశాల నిర్మాణ అధ్యక్షులు కొత్తపల్లి అశోక్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## 10 ఎకరాల రైతులకు రైతు భరోసా అందించాలి

### అభిప్రాయ సేకరణలో రైతులకు సూచన


అల్లాదుర్గంలో రైతు భరోసా అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

**అల్లాదుర్గం, జూన్ 30, ప్రభాతవార్త:** 10 ఎకరాల వరకు ప్రభుత్వం రైతులకు రైతు బరోసా కింద పెట్టబడి సహాయం అందించాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలో సొసైటీ కార్యాలయ ఆవరణలో సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి అధ్యక్షతన రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ ముఖ్య అతిథిగా హాజరై రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. భూ పరిమితి కొందరు, భూ పరిమితి విధించాలని రైతులు సూచించారు. సాగులో లేని భూములకు రైతు బంధు అందించవద్దని రైతులు అభిప్రాయ పడ్డారు. కౌలు రైతులకు సైతం రైతు భరోసా అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్ కుమార్, సొసైటీ సీఈఓ శివగౌడ్, ఏఈఓలు నవీన్‌కుమార్, విఠల్‌రావు, సొసైటీ డైరెక్టర్లు ఫర్యా నాయక్, రైతు బంధు అధ్యక్షులు బగిలి రమేష్, రైతులు గొండ్ల నారాయణ, అరిగే నర్సింలు, మురడి డాకయ్య, ఎం లక్ష్మయ్య, కర్రెల బేతయ్య, కంత షరీఫ్, వలి పాషా, వీరేశం, బి యాదయ్యలు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 30, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గ్రామానికి చెందిన సిహెచ్ సుభాష్ మెరుగైన చికిత్స అందుకునేందుకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధిలో చెక్కును అందచేశారు. బాధితుడు సుభాష్ అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార 2 లక్షల 50వేల రూపాయలను మెరుగైన చికిత్స అందుకునేందుకు మంజూరు చేయించి బాధితుడికి అందచేశారు. ఎల్ఓసి అందుకున్న సుభాష్ ఎమ్మెల్యేకు, ఎల్ఓసి మంజూరు చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



డ్రైనేజీ సమస్య పరిష్కారానికై డిఇకి ఆదేశాలిస్తున్న సబితాఇంద్రారెడ్డి

## డ్రైనేజీ సమస్యపై స్పందించిన సబితారెడ్డి

**కారు దిగి పరిశీలించి అధికారులకు ఆదేశాలిచ్చిన ఎమ్మెల్యే**

**సరూర్‌నగర్, జూన్ 30 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డు పక్కన సర్వీస్ రోడ్డులో పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీని గమనించిన స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తన క్యాంపు కార్యాలయంలో ప్రజలతో బిజీగా గడిపిన ఆమె తిరిగి వెళ్తున్న క్రమంలో రహదారి పక్కన డ్రైనేజీ సమస్య కనిపించడంతో స్పందించారు. ఈ నేపథ్యంలో వాహనం దిగిన ఆమె డ్రైనేజీని పరిశీలించి అప్పటికప్పుడు మీర్‌పేట్ కార్పొరేషన్ డిఇఇ వెంకన్నకు ఫోన్ చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని ఆదేశించారు.

## షూటింగ్‌లో డాక్టర్ వంశీధర్‌కు గోల్డ్‌మెడల్



షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో డాక్టర్ వంశీధర్‌కు గోల్డ్‌మెడల్

**హైదరాబాద్, జూన్ 30,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో డాక్టర్ వంశీధర్ నాలి హాట్రిక్ గోల్డ్‌మెడల్ సాధించారు. హైదరాబాద్‌లోని శాట్స్ రేంజ్‌లో నిర్వహించిన ఈపోటీల్లో రాష్ట్రంలోని అగ్రసేణి షూటర్లు పాల్గొన్నారు. 10మీటర్ల రైఫిల్ మాస్టర్‌మెన్ ఇండివి డ్యువల్‌విభాగంలో 380/400 స్కోర్‌తో వంశీధర్ గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించారు. ఇది అతనికి వరుసగా మూడో గోల్డ్‌మెడల్. ఈసందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి మాజీ డిజిపి అంజనీకుమార్, తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షులు అమిత్‌సంఘీ, కార్యదర్శి జె. కిరణ్‌లు హాజరై గోల్డ్‌మెడల్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర సాధన, కుటుంబం, కోచ్‌ల సహాయంతో ఈవిజయాన్ని సాధించానన్నారు. కాగా డాక్టర్ వంశీధర్ నాలి బిజెపి తెలంగాణ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

## రూ.2.9 కోట్లతో తిరుమలగిరి లేక్ సుందరీకరణ

**బ్రిగేడియర్ సోమ శంకర్**



తిరుమలగిరిలో రింగ్ సేవర్‌ను ప్రారంభిస్తున్న బ్రిగేడియర్ సోమ శంకర్

**కంటోన్మెంట్, జూన్ 30 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డులోని తిరుమలగిరి చెరువు మురుగునీటిని తొలగించి శుద్ధి చేయడానికి రూ. 2.90 కోట్ల వ్యయంతో సుందరీకరణ చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమ శంకర్, సిఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. శనివారం సాయంత్రం హెచ్ఎండబ్ల్యుఎస్.ఎస్.బి. సహకారంతో 15వ ఫైనాన్స్ కమీషన్ నిధులతో రూ.2.9 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న తిరుమలగిరి సరస్సు సుందరీకరణకు ప్లాంట్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 450 మీ.మీ.మురుగునీరును తొలగించేందుకు దయారింగ్ వేయడం జరుగుతుందన్నారు. మురుగునీరు చెరువులోకి ప్రవేశించకుండా చిన్న మొక్కల వద్ద మురుగునీరు నిల్వకుండా ఉంచేందుకు పంప్‌హౌజ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మురుగునీరు చెరువులోకి రాకుండా ఔట్‌లెట్ మురుగునీటిని ఎత్తి వేసేందుకు పంప్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఈఓ విజయ్ కుమార్ బాలన్ నాయర్, ఛీఫ్ ఇంజనీర్ సి.హెచ్.ఉమా శంకర్, శానిటరీ సూపరిండెంట్ ఎండేవేందర్, ఇంజనీర్లు ఫనికుమార్, దినేశ్, కాంగ్రెస్ నాయకులు తేజ్‌పాల్, నాగినేని సరిత, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని మార్చే శక్తులుగా బిసిలు ఎదగాలి

**రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి**

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** బీసీలు సమాజాన్ని మార్చే శక్తులుగా ఎదిగి సోషల్ రివెల్యూషన్ తీసుకురావాలని డిల్లీ యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఐ.తిరుమలి అన్నారు. సోమాజీగూడా ప్రెస్ క్లబ్‌లో ప్రతి నెల చివరి ఆదివారం జరిగే బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. బీసీలు బానిసలు కారనీ, వారిలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మార్పు రావాలన్నారు. అప్పుడే రాజ్యాధికారం సాధ్యమని పేర్కొన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా బీసీలు ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బీసీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, యూత్ ప్రెసిడెంట్ పి.సతీష్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ సంఘాల కుల పెద్దలు, ఉద్యోగ సంఘ బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కమలాకర్‌శర్మ కేసు సిఐడికి అప్పగించాలి

**సైఫాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** అధిక వడ్డీ పేరుతో తెలుగు రాష్ట్రాల్లోనూ, దేశంలోనూ విదేశాల్లో 5 వేలమంది బ్రాహ్మణులను మోసంచేసి 1000 కోట్లు లూటిచేసిన ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్‌నేషనల్ నిందితుడు కమలాకర్‌శర్మ కేసును సిసిఎస్ నుంచి సిఐడికి గాని సిట్‌కు బదిలీ చేయాలని ధన్వంతరి బాధితుల ఫోరం డిమాండ్ చేసింది. శర్మ కొనుగోలు చేసిన భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని విక్రయించి బాధితులకు న్యాయం చేయాలని ఫోరం ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బాధితుల సమావేశంలో ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ ప్రతినిధులైన వెంకటరమణశర్మ, ఆత్రేయ శర్మతో కలిసి మాట్లాడుతూ 2004లో ఫౌండేషన్ పేరిట వృద్దులైన బ్రాహ్మణులకు మాయ మాటలుచెప్పి, అధిక వడ్డీ ఇస్తానని ఒకొక్కరి నుంచి లక్ష రూపాయల నుంచి పది కోట్ల రూపాయల వరకు డిపాజిట్లు చేయించుకుని దోచుకున్నారని ఆరోపించారు. దోచుకున్న డబ్బులతో ఒక టివి ఛానల్ ఏర్పాటు చేశారని, పది దొంగ సూట్‌కేసు కంపెనీలు సృష్టించారని, వందల ఎకరాల భూములు కొనుగోలు చేసి తనపేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు. ఆ గ్రహారాల పేరిట వేలాది ముందిని ముంచిన కమలాకర్‌శర్మ మూడేళ్ళుగా మెహం చాటేసి తిరుగుతున్నారని, అసలు, వడ్డీ చెల్లించకుండా మొత్తానికి ఎగనామం పెడుతున్నారని, ఎక్కువగా మాట్లాడితే ఐపి పెడతానని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. దీంతో ఆయన భాగోతం బయట పడటంతో బాధితులు అతనికి దేహశుద్ధి చేశారని, సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారని, ఇటీవల బెయిల్‌పై విడుదలైన శర్మ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, అతని పాస్‌పోర్ట్ సీజ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మధ్య అతను ఆ ఆస్తులను అమ్మకానికి పెట్టారని ప్రభుత్వం అమ్మకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేసి

# బానిసత్వపు చట్టాలను మార్చుకోవాలి

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** బానిసత్వపు ఆలోచనలు, చట్టాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. గతంలో కేంద్ర క్యాబినెట్‌లో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు ఐపిసి, సిఆర్‌పీసీ లాంటి చట్టాలను మార్చాల్సిన అవసరం ఉందని చెప్పడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఫోరం ఫర్ నేషనలిస్టు థింకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని కెఎంఐటిలోని సర్దార్‌పటేల్ ఆడిటోరియంలో జరిగిన 'అన్‌న్యూక్రిమినల్ మేజర్ యాక్ట్స్ డిస్కషన్' వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ రోజు ఆనేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఈ చట్టాలు ఏ ఒక్కరిని దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చినవి కావని, అందరిని పరిగణలోకి తీసుకుని చేయడం జరిగిందని, దేశంలో మార్పుకోసమే చేశామని, పార్లమెంట్‌లో ఇంకా కొన్ని చట్టాలు మార్పు చేయవలసి ఉందన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను ఇంకా ఎందుకు కొనసాగించాలన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా ఈ బానిసత్వపు ఆలోచనలతో మన దేశం ఇంకా కొనసాగాలా?, ప్రధాని మోదీ ఖచ్చితంగా దేశానికి మంచి చేస్తారని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లో ఆనేక మార్పులు వస్తున్నాయని, అలాంటి మార్పును మనం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని, 2020లో మోదీ చట్టాల మార్పుకు శ్రీకారం చుట్టారని ఆయన వివరించారు. ప్రస్తుతం దేశంలో ఐపిసి, సిఆర్‌పీసీలను మార్చాల్సిన అవసరం ఉందని, దేశ అవసరాలకు దేశంలో వస్తున్న మార్పులకు, పెరుగుతున్న టెక్నాలజీ అవసరాలకు, పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా నవతరానికి, యువతరానికి కావాల్సిన మంచిచేసే చట్టాలను మనం మార్చుకోవాల్సిన అవసరం ఉందని జి.కిషన్‌రెడ్డి చెప్పారు

## మంత్రముగ్ధులను చేసిన కూచిపూడి నాట్యం

**చిక్కడపల్లి, జూన్ 30 ప్రభాతవార్త:** అభినయంలో స్పష్టత, సమైక్యంగా పదముద్రలలో నర్తకీమ ణులు చూపిన ఏకాగ్రత ప్రతి నాట్య అంశం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఆదివారం చిక్కడ పల్లి శ్రీత్యాగరాయ గాన సభలో అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమి నిర్వహనలో ప్రఖ్యాత ఆలయ నృత్య కళాకారిణి వోలేటి రంగమణి ఆమె కుమార్తె రేఖల శిష్యబృందం కూచిపూడి నాట్య నీరాజనం పేరిట ప్రదర్శించిన నాట్య అంశాలు గురువుల శిక్షణకు అద్దం పట్టాయి. వినాయక స్తుతితో ప్రదర్శన ఆరం భించి దశావతారం, భువనేశ్వరి స్తుతి, అంబ నీరాజనం అంశాలలో పదిమేను మంది నర్తకిమణులు నర్తనం కనులకు విందు చేసింది. అరుదైన ఆలయ నృత్యంలో ప్రావీణ్యం ఉన్న రంగ మణి,రేఖల శిష్యురాలు వైష్ణవి, ప్రవల్లిక, మధుమిత, శ్రీనికలు సింహ నందిని అంశాన్ని అపూర్వంగా నర్తించారు. తెల్లటి తివాచిపై రంగులు చల్లి వేదికపై పరిచి దీనిపై నర్తకీమణులు లయబద్ధంగా నర్తిస్తూ తమ పద ముద్రలతో తివాచిపై సింహం చిత్రాన్ని రూపొందిస్తారు. అద్భుతమైన ఈ అంశం ప్రేక్షకులను ఆశ్చర్య చకితులను చేసింది. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా హాజరైన ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథ రావు, ఉద్యానవనాలు పట్టుపరిశ్రమశాఖ అధికారి చక్రపాణి, రచయిత్రి డాక్టర్ సుధా రామరాజు పాల్గొని మరుగున పడుతున్న ఆలయ నృత్య సంప్రదాయం తమతండ్రి నుంచి వారసత్వం గా అంది పుచ్చుకుని రంగమణి కొనసాగిస్తున్నారని అభినందించారు.రంగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాచీన కళా సంస్కృతిని కాపాడుకోవటానికి సహకారం అందించాలని కోరారు.

## వాస్తవిక కథానికల మేళవింపు 'నీ స్నేహం కోసం'

**రవీంద్రభారతి, జూన్ 30 ప్రభాతవార్త :** వాస్తవిక కథలు ప్రాంతీయత నేపథ్యంలో చెబితే పాఠకులకు ఆసక్తి కలిగిస్తుందని, అందుకు నిదర్శనమే నీ స్నేహం కోసం సంపుటిలోని కథలున్నాయని, రచయిత కనకాచారి వ్రాసిన ఈ 15 కథలు నిత్యసత్యాలని ప్రముఖ వక్తలు ప్రశంసించారు. సమాజంలో మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిత్వాన్ని నిలుపుకొంటూ కనకాచారి గొప్పగా రాణిస్తున్నారని డా. మామిడి హరికృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కామన్ దయాస్, రవ్వలకొండ విశ్వబ్రాహ్మణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ వర్ధమాన రచయిత, సీనియర్ పాత్రికేయుడు తంగెళ్ళపల్లి కనకాచారి రచించిన నీ స్నేహం కోసం కథానికల సంపుటి ఆవిష్కరణోత్సవం ఆదివారం ఉదయం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలుగుతల్లి రూపశిల్పి జి.వి.ఆర్.చారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ఉద్యమకారుడు రుద్రశంకర్ ఆత్మీయ అతిథులు డా. మామిడి హరికృష్ణ, దైవజ్ఞశర్మ, శైలజామిత్ర, జయసూర్య, డా. పి.లలితావాణి తదితరులో కలిసి ఆవిష్కరించి రచయిత కనకాచారి పాత్రికేయుడుగా సమాజాన్ని సూక్ష్మపరిశీలన చేశారని, అవసరమైన వస్తువును ఎంపికచేసి సామాజిక చింతన, వాస్తవాలను నిజాయితీతో వ్రాసారన్నారు. భీమన్న సాహితీనిధి వ్యవస్థాపకురాలు హైమవతి భీమన్న కృతిని స్వీకరించారు. గ్రంథాలయ ఉద్యమనేత, సాహితీకారుడు శ్రీవట్టికోట ఆళ్వారుస్వామి స్మారక ప్రతిభా పురస్కారాలను వివిధరంగాల్లో విశేష సేవలందిస్తున్న 12మంది ప్రముఖులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చివరిగా రచయిత తంగెళ్ళపల్లి కనకాచారిని ఘనంగా సన్మానించారు.

## మొక్కలు నాటండి... పర్యావరణాన్ని పరిరక్షించండి

**నార్సింగి, జూన్ 30 ప్రభాతవార్త :** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో జరిగిన వన మహోత్సవంలో మేయర్ లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమీషనర్ శరత్‌చంద్రలతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై వాతావరణం చల్లబడేందుకు, సకాలంలో వర్షాలు కురిసేందుకు, సర్వ ప్రాణులకు అవసరమైన ఆక్సిజన్ విడుదల చేసేందుకు మొక్కలు అత్యవసరమన్నారు. గతంలో ఉన్న భారీ వృక్షాలను తొలగిస్తూ ఆకాశ హర్మ్యాలను నిర్మించుకుంటూ పోతున్నామని, దీంతో ఏటేటా వర్షాలు తగ్గి, వాతావరణం వేడెక్కుతుందన్నారు. ఎక్కడ అడవులు ఎక్కువగా ఉంటాయో అక్కడ వాతావరణం చల్లగా ఉంటుందని, వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమంలో ప్రజలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, యువజన, మహిళా సంఘాలు, స్వచ్చంద సంస్థలు అందరూ స్వచ్చందంగా భాగస్వాములు కావాలని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పోరేటర్లు చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి పాపయ్య యాదవ్, సాగర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, నాయకులు సురేష్‌గౌడ్, పాపయ్య యాదవ్ పాల్గొన్నారు.

## ప్రధాని మన్‌కిబాత్‌ను శ్రద్ధగా విన్న బిజెపి నేతలు

**నార్సింగి, జూన్ 30 ప్రభాతవార్త :** మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా నిర్వహిస్తున్న "మన్‌కిబాత్" కార్యక్రమాన్ని ఆదివారం మణికొండ బిజెపి నాయకులు శ్రద్ధగా విన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రజలతో నేరుగా మాట్లాడుతూ, వారి కష్టాలను విని, సరైన పరిష్కారం చూపుతున్న ఏకైక ప్రధాని మోడీ అని పేర్కొన్నారు. నిజమైన సమాజ సేవకులను గుర్తించి, తగిన గుర్తింపునిస్తూ, ఏకంగా పద్మ అవార్డులతో సత్కరిస్తున్నారని వివరించారు. పరీక్షల సమయంలో విద్యార్థులలో ధైర్యంను నింపేందుకు అనేకవిలువైన సూచనలు, సలహాలు ఇస్తున్నారని తెలిపారు. రైతులు, మహిళలు, యువకులు ఇలా అన్ని రంగాలలోని వారి నుంచి దేశ హితం కోసం విలువైన సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటున్నారన్నారు. కొన్ని కోట్ల మంది ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న "మన్‌కిబాత్" కార్యక్రమాన్ని వింటూ, చూస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు మన ప్రధాన మోడీ అని తెలిపారు. నిత్యం దేశం కోసం శ్రమిస్తున్న మహా నాయకుడు మోడీ అన్నారు. వరుసగా పదేళ్ల కాలం పాలన సాగించినా ఒక్క రూపాయి అవినీతికి తావివ్వలేదన్నారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



మన్‌కీబాత్‌ను టీవీలో చూస్తున్న బిజెపి నాయకుల



సైక్లోథాన్‌లో ఎంఎల్ఆర్ కళాశాలల అధినేత మర్రి లక్ష్మారెడ్డి

## పెడల్ ఆఫ్ ద ప్లానెట్ సైక్లోథాన్ విజయవంతం

**అల్వాల్, జూన్ 30 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణపై పౌరులులో అవగాహన కల్పించేందుకు బొల్లారం రాష్ట్రపతి నిలయం వర్గాలు నిర్వహించిన సైక్లింగ్ మారథాన్ ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఎనిమిది వందలు మందికి పైగా సైకిలిస్టులు ఉత్సాహంగా సైక్లోథాన్‌లో పాలు పంచుకున్నారు. రాష్ట్రపతి నిలయం నుంచి ఇసిఐఎల్ ఎక్స్ రోడ్డువరకు సైక్లింగ్ జరిగింది. నగరంలో ఇంత పెద్ద స్థాయిలో సైక్లింగ్ మారథాన్ నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. రాష్ట్రపతి నిలయం, మినరల్ డవలప్‌మెంట్ కార్పొరేటర్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్‌లు సంయుక్తంగా కార్యక్రమాన్ని చేపట్టాయి. ప్రపంచ వ్యాప్తంగా జూన్‌నెలలో ప్రపంచ పర్యావరణ దినోత్సావాలు జరుగుతున్నాయి. పర్యావరణ ప్రేమికులను ఒక చోటకి చేర్చడం పచ్చని భూ తోరణానికి సైకిల్ పెడల్ తోడు అనే అంశం ప్రధానమైనది. వారసత్వ సంపదైన రాష్ట్రపతి నిలయం మరియు పర్యావరణం ఒకే ఒడిలో ఉన్న నేపధ్యంలో సైక్లింగ్ మారథాన్ చారిత్రాత్మకంగా జరిగింది. రాష్ట్రపతి భవన్ ప్రత్యేక అధికారులు శశి, స్వాతి నిలయం ఎస్టేట్ మేనేజర్ రజనిలు పర్యవేక్షణలో మారధాన్ విజయవంతమైంది.

**భారతీయ శాస్త్రీయ సంగీత**

## నృత్య కళారూపాలను పరిరక్షించాలి

**చిక్కడపల్లి, జూన్ 30 ప్రభాతవార్త:** భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళారూపాలను పరిరక్షించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ కవి, విశ్లేషకులు చినుకు పిఎన్.మూర్తి అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రెండు రోజుల పాటు నటరాజ నృత్యనికేతన్, శ్రీలలితా కళా నృత్యనికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ సంగీత నృత్యోత్సవం-12 శంభో శివశంబో' టైటిల్‌తో సంగీత నృత్యప్రదర్శన ప్రారంభించారు. నటరాజ నృత్యనికేతన్, శ్రీలలితా కళా నృత్యనికేతన్ నాట్య గురువులు జట్ల చిన్న వీరభద్రరావు, డాక్టర్ అరవ ఆంజనేయులు నిర్వహణలో మొదటి రోజు 300 మంది రెండవ రోజు 175 మంది సంగీత, నృత్య కళాకారులు చక్కటి నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. చినుకు బ్రాండ్ అంబాసిడర్లుగా అరవ గీతాంజలి, నక్షత్ర, స్నిగ్ధలను గుర్తిస్తూ పిఎన్. మూర్తి ప్రకటించి ప్రసంగించారు. సెప్టెంబరు నెలలో 'సురభారతి' సంగీత కళాకేంద్రం ఆధ్వర్యంలో స్నాతకోత్సవ సభలో బంగారు పథకాలను సాధించిన వారిని సత్కరిస్తామన్నారు. కాగా ఆదివారం చిన్న జీయర్ స్వామి ఆస్థాన ఇచ్చే గురువులు ఘంటసాల పవవన్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు డి.సుమన్, వి.నాగబాబు, ప్రముఖ నాట్యాచార్యులు తాతా వెంకట వరప్రసాద్, నాట్య గురువులు లాస్య రంజని, శాస్త్రీయ నృత్యఅకాడమి రేఖ కోలాట, గురువులు లక్ష్మీదేవి, అచ్యుతాంబ, సరస్వతి నటరాజు, కళారుచినికేతన్ గురువులు గౌతమి రాణి తదితరులు శిష్యబృందంతో అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం గురువులను సత్కరించారు.

## రాష్ట్రంలో సైకాలజిస్టులందరికి కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి

**సైఫాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** సమాజంలో ప్రతి మనిషికి మానసిక ఆరోగ్యం ఎంతో ప్రధానమైన అంశంగా మారుతున్న నేపధ్యంలో తెలంగాణ రాష్ట్రంలో సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయడం అత్యంత అసరమని, సైకాలజిస్ట్స్‌కి ఒక భద్రత, భరోసా కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 7 సంవత్సరాలుగా సైకాలజిస్ట్‌ల సమస్యలపై తాము పోరాడుతున్నామని మనస్తత్వ శాస్త్ర ప్రాముఖ్యతను ప్రభుత్వానికి ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం మా సేవలను గుర్తించి సైకాలజిస్ట్స్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని, సైకాలజిస్టులు, మానసిక ఆరోగ్య నిపుణులకు ఒక కౌన్సిల్ ఏర్పాటైతే వారు మరింత సమర్థవంతంగా, సమన్వయంతో పనిచేస్తారని ఆయన స్పష్టం చేశారు. సైకాలజీ ప్రాక్టిస్‌కు సంబంధించిన నాణ్యత నియంత్రణ కోసం మార్గదర్శకాలు సైకాలజిస్ట్‌లందరికి సరైన లైసెన్సింగ్, రిజిస్ట్రేషన్ విధానాలు చేయడం, నిరంత విద్య, వృతిపరంగా అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ డానికి, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన పరిశోధనలు మరింతగా ప్రోత్సహించడానికి కౌన్సిల్ అవసరమన్నారు. అందువల్ల మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి కౌన్సిల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్, నాయకులు సునయన, శ్రీకాంత్, బాలసుబ్రమణ్యం, వైదేహి, రాజు ఆచార్య, ఉమర్ ఖనాన్, క్రిష్ణసాహితి, చెరువు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నార్సింగి, జూన్ 30 ప్రభాతవార్త :** నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న "2004-2004" బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మయ సమ్మేళనం ఆద్యాంతం ఆనందభరితంగా సాగింది. అనాటి విద్యార్థులంతా కలిసి తమకు పాఠాలు బోధించిన గురువులు శివశంకర్, రాములు, మాణిక్‌లాల్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం తరగతి గదిలో వారు చేసిన అల్లరిని, చదువులో రాణించేందుకు అనుసరించిన వ్యూహాలను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకొని మైమరిచిపోయారు. ఆ పాత మధుర క్షణాలను గుర్తు చేసుకొని, ఏ బెంచిలో కూర్చునే వాళ్లమో, తమకు ఏ ఉపాధ్యాయుడు ఇష్టమో, ఏఆట ఇష్టమో వంటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషానందానికి లోనయ్యారు. సంతోషం, సంతృప్తి ఇచ్చే ఆనందం ఇంకెక్కడా లభించదని ఒకరికొకరు ఆలింగనం చేసుకొని, చిన్న పిల్లల్లా మారిపోయారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగని హరికృష్ణ, మల్లేష్ యాదవ్, జెల్లి మహేందర్, శ్రీశైలం, గోపాల్ పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

**ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్**

**సంజీవరెడ్డినగర్, జూన్ 30, ప్రభాతవార్త**

అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధ్వజమెత్తారు. ఆదివారం సనత్‌నగర్‌లోని ఉదయ నగర్ కాలనీ పార్క్‌లో 9 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ క్రీడా పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 9 సంవత్సరాలలో ఎవరూ ఊహించని విధంగా అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చి 7నెలలుదాటినా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదని విమర్శించారు. సమస్యలు పరిష్కారంకాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గత ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది రూపాయల విలువైన అనేక అభివృద్ధి పనులను నూతన ప్రభుత్వం రద్దు చేసిందని, ఇది చాలా దుర్మార్గపు చర్య అని అన్నారు. ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్ ఆధునీకరణ కోసం 3 కోట్ల రూపాయలు, బేగంపేటలో ముస్లీం గ్రేవ్ యార్డ్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా అడ్డుకుందని ఆరోపించారు.ఈ ఆషాడమాసం అనంతరం అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేవిధంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, జిహెచ్ఎంసి డిఈ మోహన్, వాటర్‌వర్క్స్ అధికారి వంశీ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ఖలీల్, కరీం, పుష్పలత, సరిత తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షం..స్తంభించిన ట్రాఫిక్

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త :** నగరంలో పలు చోట్ల భారీ వర్షం కురిసింది.ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా దట్టమైన మేఘాలు కమ్మేశాయి. ఆ తర్వాత గాలులతో కూడిన వర్షం కురిసింది. కెపిహెచ్‌బి, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట్, ప్రగతినగర్, బోరబండ, యూసుఫ్ గూడ, జూబ్లీహిల్స్, మైత్రీవనం, అమీర్‌పేట, పంజాగుట్ట, రామంతాపూర్, బోడుప్పల్, నాచారం, సికింద్రాబాద్, బేగంపేట్, బోయిన్‌పల్లి, తిరుమల గిరి, బొల్లారం, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్, ఖైరతాబాద్, ఎర్రమంజిల్, ముషీరాబాద్, చిక్కడపల్లి, గాంధీనగర్, దోమలగూడ, ఆర్టీసిక్రాస్‌రోడ్, నారాయణగూడ, కాచిగూడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది.దీంతో లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. దీంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై వాహనాలు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జిహెచ్ఎంసి సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

**టి20 వరల్డ్ కప్‌ను ఇండియా గెలవడంతో**

## పాతబస్తీలో పెద్దఎత్తున సంబరాలు

**చార్మినార్, జూన్ 30 ప్రభాతవార్త :** టి 20 వరల్డ్ కప్‌ను ఇండియా గెలుసుకున్న సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో శనివారం అర్ధరాత్రి ప్రజలు పెద్దఎత్తున సంబరాల నిర్వహించారు.ఇండియా-దక్షిణఫ్రికా దేశాలు మధ్య క్రికెట్ ఆట జరుగుతున్న సమయంలో ప్రజలు టివిలకు అతుక్కుపోయారు.చివరి వరకు ప్రజలు ఎంతో ఉత్కంఠంతో ఆటను చూశారు.కాగా దక్షిణాఫ్రికాపై ఇండియా విజయం సాధించటంతో పాతబస్తీలోని పలు ప్రాంతాలలో టపాకాయలు పేల్చారు.మదీనా సర్కిల్ మహ్మద్ క్యాప్ మార్ట్ వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ఇండియా-దక్షిణాఫ్రికా జట్టుల ఆటను ప్రజలు ఎంతో ఆసక్తితో తిలకించారు.టి 20 వరల్డ్ కప్‌ను ఇండియా కైవసం చేసుకోవటంతో మహ్మద్ క్యాప్ మార్ట్ వద్ద మిఠాయిలు పంపిణీ చేశారు. ఘాన్సీ బజార్, కోకరివాడి, లాల్‌దర్వాజ, ఛత్రినాక, అలియాబాద్, పురానాపూల్, ఆనంద్‌గల్లీ, గౌలిపుర ప్రాంతాలలో పెద్ద ఎత్తున యువకులు సంబరాలు నిర్వహించారు.

## రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖను ఏర్పాటు చేయాలి

**సైఫాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలో దళిత అభివృద్ధి శాఖను సాంఘిక సంక్షేమ శాఖగా మార్చి మంత్రిని నియమించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్‌బాబు, జాతీయ కార్యదర్శి సి.బాలకృష్ణ సిఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినప్పటికి ఇంత వరకు సాంఘిక సంక్షేమ శాఖకు మంత్రిని నియమించకపోవడం అన్యాయమన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కరణం కిషన్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా పగడం శ్రీనివాస్‌ను నియమించి, నియామకపత్రాలను అందజేసిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ లేకపోవడంతో దళితులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే శాఖకు మంత్రిని నియమించాలని కోరారు. రాష్ట్రంలో ఆర్‌పిఐని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ స్థాపించిన ఆర్‌పిఐ అంబేద్కర్ అశయాల సాధన కోసం ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టిలు పార్టీలో చేరాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు గడ్డం శంకర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జేఎల్ సుదేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ ఆనవాళ్ల కోసం డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

**బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పబ్‌లలో తనిఖీలు**

**పంజగుట్ట జూన్ 30 (ప్రభాతవార్త):** జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ లలోని పలు పబ్‌లలో పోలీసులు డ్రగ్స్ ఆనవాళ్ళ కోసం విస్తృతంగా ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు.ఎన్నిసార్లు దాడులు నిర్వహించినా పలు పబ్‌లలో డ్రగ్స్ ఆనవాళ్ళు కనిపిస్తుండడంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశానుసారం నార్కొటిక్ ట్రెయిన్డ్ డాగ్స్(స్నిఫ్ఫర్ డాగ్స్) సాయంతో తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాలలో వీకెండ్స్ డ్రగ్స్‌కల్చర్‌ను పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నా ఏదోక రూపేణా పబ్‌లలో డీజెలు అక్రమంగా మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తూనే ఉన్నారని ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో స్థానిక అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. దీనిలో భాగంగా అనుమానం ఉన్న ప్రాతి చోటా తనిఖీలు నిర్వహించడం, సమాచారం సేకరించడానికి ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేసుకుని డ్రగ్స్ రహిత పబ్‌లే లక్ష్యంగా పోలీసులు ముందుకుపోతున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాలలో పబ్‌ల నిర్వాహకులకు కూ డా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పనస పళ్ళ చాటున గంజాయి తరలింపు..

# గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

**ఒక బొలేరో, కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు..**

**పేట్‌బషీరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త :** పనసపళ్లచాటున గంజాయిని తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమీప ప్రాంతాల నుండి కరీంనగర్ వైపు ఓ బొలేరో వాహనంలో గంజాయి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుండి కరీంనగర్ - హైదరాబాద్ రాజీవ్ రహదారిలో మేడ్చల్ ఎస్వోటీ, శామీర్‌పేట పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ 39యూయూ 4550 నంబరు గల బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా పనసపళ్ళ లోడుతో గంజాయిని తరలిస్తున్నారని గుర్తించారు. అంతేకాకుండా గంజాయి తరలిస్తున్న ఈ బొలేరో వాహనాన్ని అనుసరిస్తున్న మరో కారుతో పాటు 35 కిలోలకు పైగా గంజాయితో పాటు గేదెల సతీష్, కోరాడ సాయి, బండారు శివకుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. శివ అనే వ్యక్తి పరారిలో ఉన్నాడు. ఈ కార్యక్రమంలో డీసీపీ కోటిరెడ్డి, ఎస్ఓటి డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ రాములు, సిఐ శ్రీనాథ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

**మూసాపేట, జూన్ 30, ప్రభాతవార్త :** కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న కే.నాగప్ప (70), వై.లక్ష్మీలు తన ద్విచక్ర వాహనం ఏపీ28 సీసీ 0486 నంబర్ గల వాహనంపై ఐడిఎల్ చెరువు వైపు వెళ్తుండగా మార్గం మధ్యలోనే అతివేగంగా వచ్చిన క్రెటా టీఎస్07 ఈఆర్2727 నెంబర్‌గల కారు వెనకనుంచి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నాగప్ప, లక్ష్మీ కిందపడిపోయారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, పోలీసుల సహాయంతో చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగప్ప మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. లక్ష్మీ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 262 మంది పట్టివేత

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** డ్రంక్ ఎండ్ డ్రైవ్‌లో 262 మంది పట్టుబడిన వైనం సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు భారీ ఎత్తున డ్రంక్ ఎండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా, 262 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. 191 ద్విచక్రవాహనాలు, 11 ఆటోలు, 56 కార్లను పోలీసులు సీజ్ చేసి, పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. డ్రంక్ ఎండ్ డ్రైవ్ చేసి ప్రమాదాలకు కారకులైతే సెక్షన్ 304 పార్ట్ 2 కింద అరెస్ట్ చేసి 10 సంవత్సరాలు జైలు శిక్షపడేలా చేస్తామని సైబరాబాద్ కమీషనర్ అవినాశ్ మహంతి పేర్కొన్నారు.



అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

### అధికారుల లాంఛనాలతో అంత్యక్రియలు

**సిద్దిపేట అర్బన్, జూన్ 30, ప్రభాతవార్త :** సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కుచన్‌పల్లి యాదగిరి(52) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. హెడ్ కానిస్టేబుల్ యాదగిరి విధులు నిర్వహిస్తుండగా రాత్రి 11.30 ప్రాంతంలో గుండెనొప్పి రావడంతో వెంటనే సీఐ విద్యాసాగర్, ఎస్ఐ భాస్కర్, పోలీసు సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి యాదగిరి గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. సీపీ డా॥అనురాధ బాధిత కుటుంబీకులను ఫోన్‌లో మాట్లాడి సంతాపం వ్యక్తం చేసి పరామర్శించారు. శాఖ పరంగా రావాల్సిన బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందిస్తామన్నారు.

హెడ్ కానిస్టేబుల్ యాదగిరి అంత్యక్రియలు సీపీ డా॥అనురాధ ఆదేశాల మేరకు అధికార లాంచనాలతో నిర్వహించారు. అర్మూడ్ పోలీసులు గాలిలోకి మూడు రౌండ్ల కాల్పుల జరిపి అధికారికంగా నివాళులర్పించారు. కాగా పోలీసు అధికారులు, సిబ్బంది రామచంద్రరావు, మధు, విద్యాసాగర్, పూర్ణచందర్, విజయభాస్కర్, సాయిచరణ్, పోలీసు సంఘం ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, తదితరులు యాదగిరి మృతి దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమత్తం ప్రభుత్వం తరపున రూ.20 వేలు అందజేశారు.

## డిసిసి మహిళా అధ్యక్షురాలుగా దానంపల్లి సుజాత



నియామక పత్రం అందుకుంటున్న సుజాత

**హత్నూర జూన్ 30,.ప్రభాతవార్త:** హత్నూర మండలం కొన్యాల గ్రామానికి దానంపల్లి సుజాతా మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర పిసిసి మహిళా విభాగం అధ్యక్షురాలు మొగిలి సునితా రావు నియమకపు ఉత్తర్వులు జారీచేశారు.ఆదివారం జరిగిన కార్యాక్రమం లో నియమక ఉత్తర్వులను కాంగ్రెస్‌పార్టీ నాయకులు మైనంపల్లి హనుమంతరావు,పిసిసి ప్రదానకార్య దర్శి అవులరాజిరెడ్డిల చేతుల మీదుగా,నియమక ఉత్తర్వులను దానంపల్లి సుజాత అందుకున్నారు. కార్యాక్ర మంలో మెదక్‌జిల్లా డిసిసి అధ్యక్షులు అంజనేయులుగౌడ్, హత్నూర మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కర్రె కృష్ణ,నాయకులు దానం పల్లి సత్యం,సాయి తదితరులు పాల్గోన్నారు.

## సిటిజన్ క్లబ్ ఇంచార్జి అధ్యక్షులుగా సురేష్ ఎన్నిక ఏకగ్రీవం

**సిద్దిపేట రూరల్, జూన్ 30, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రం లోని సిటిజన్ క్లబ్ అధ్యక్షులు చొప్పదండి మురళిధర్ బహిష్కరణకు గురుకావడంతో ఉపాధ్యక్షులుగా ఉన్న పొడిశెట్టి సురేష్‌ను అధ్యక్షులుగా కొనసాగించడానికి క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మాణించింది. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, క్రీడల కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఏకలవ్వ ఎరుకల సంఘం ఎన్నికలు

### అధ్యక్షులుగా కెమ్మసారం రాజేష్ ఖన్నా ఎన్నిక

**సిద్దిపేట అర్బన్, జూన్ 30, ప్రభాతవార్త :** సిద్దిపేట ఏకలవ్వ ఎరుకల సంఘం ఎన్నికలు అదివారం సిద్దిపేటలో ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి కెమ్మసారం రాజేశ్వర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏకలవ్వ కమ్యూనిటీ భవన్‌లో పోలింగ్ అధికారి ఎన్. డాకయ్య, ఎన్నికల నిర్వహణ అధికారికి కె.రాజేశ్వర్ అధ్వర్యంలో ఏకలవ్వ ఎరుకల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ అధికారి మాట్లాడుతూ సిద్దిపేట ఏకలవ్వ ఎరుకల సంఘం ఎన్నికలలో అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ చేయగా ప్రధాన కార్యదరి ్శ పదవికి ఇద్దరు పోటీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో కెమ ్మసారం అశోక్‌కు 50 ఓట్లు,కెమ్మసారం రాజేష్ కన్నాకు 89 ఓట్లు, కెమ ్మసారం నగేష్‌కు 6 ఓట్లు వచ్చినట్లు తెలి పారు. కెమ్మసారం అశోక్‌పై 39 ఓట్లతో రాజేష్ ఖన్నా గెలుపొందినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శులుగా కెమ్మసారం నాగరాజుకు 111, కెమ్మ సారం రమేష్‌కు 33 ఓట్లు రాగా కెమ్మసారం రమేష్‌పై కెమ్మసారం నాగ రాజు 78 ఓట్లతో ఎన్నికయ్యారు.

## జనసేన బలోపేతానికి కృషి

**సిద్దిపేట అర్బన్, జూన్ 30, ప్రభాతవార్త :** జనసేన పార్టీని తెలంగాణలో సిద్దిపేట జిల్లాలో బలోపేతం చేయడానికి త వంతుగా కృషి చేస్తామని జనసేన పార్టీ నాయకులు మురార్ కార్ సాయికుమార్, శివకుమార్, ధర్మేందర్‌లు అన్నారు. అదివారం సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎపి డిప్యూటి సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాకతో సిద్దిపేట జిల్లాలో జనసేనకు ఊపు వచ్చిందన్నారు. పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలకడానికి వచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో గ్రామ గ్రామాన జనసేన కమమిటీలను ఏర్పాటు చేసి జన సైనికుల అధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కనకరాజు,రాజేష్,కన్నయ్య, ప్రసాద్,భరత్, దినేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మా దుర్గమ్మ జర సల్లగ సూడమ్మా...

### -ఏడుపాయల్లో జనమే జనం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**పాపన్నపేట, జూన్, 30, ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయాన్ని ఆదివారం ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి, మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడి బియ్యం నింపి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ సిబ్బంది రవివీర్ కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, నర్సింలు, వరుణాచారి, భత్తిని రాజు, యాదగిరి, శ్రీకాంత్‌లు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, మురళీధర్, రాజశేఖర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

# సేవా కార్యక్రమాలు విస్తరించి సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి

### ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త ః** రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను విస్తరించుకోవాలని ఆ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనివాసరావు తెలిపారు. రామాయంపేట పట్టణములోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ శాఖ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం చైర్మెన్ లయన్ డా.ఏ.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మేనేజ్మెంట్ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు అలాగే మెదక్ కలెక్టరేట్‌లో ఆఫీస్‌రూమ్ విషయంలో చర్చించారు. జూలై 3న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మెన్ శ్రీ అహాయ్ మిశ్రా పర్యటన వివరాలను తెలిపారు. వైస్ చైర్మెన్ పొడెండ్ల లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాలు మరియు సేవా కార్యక్రమాలు అందరి సహకారంతో చేపడుతున్నట్లు, కార్పోరేట్ సంస్థల ద్వారా నిధులను సేకరించాలని తెలిపారు. శాఖ కోశాధికారి డి.జి.శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ సమస్త సేవా కార్యక్రమాలకు ఖర్చులు నిమిత్తం జరిగిన లావాదేవిలను సభ్యులకు వివరించారు. మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమె యాదగిరి మాట్లాడుతూ సభ్యులందరూ ఏకంగా సేవా కార్యక్రమాలను ఇకముందు కూడా చేపట్టాలని తెలిపారు. వంగరి కైలాసం మాట్లాడుతూ సంస్థ రాణించాలంటే



సమావేశంలో పాల్గొన్న సొసైటీ ప్రతినిధులు

సభ్యులందరూ కలసి పారదర్శకంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మద్దెల సత్యనారాయణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి సభ్యత్వ నమోదుకు కృషి చేస్తూ సభ్యులందరినీ భాగస్వాములు చేయాలని తెలిపారు. దామోదర్‌రావు మాట్లాడుతూ రోజుల్లో 24 గంటల పాటు తాను అందుబాటులో ఉంటానని, ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. మద్దెల రమేష్‌లు హాజరై భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమములు, మరియు సేవలకు సూచనలు ఇవ్వడం జరిగింది.



బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న సంఘ సేవకుడు పుట్టి సందీప్

## బాధిత కుటుంబానికి ఐదువేల ఆర్థిక సహాయం

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త ః** రామాయంపేట పట్టణానికి చెందిన మ్యాతరి లింగం అనారోగ్య కారణాలతో చనిపోవడంతో అతని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే... రామాయంపేట పట్టణానికి చెందిన సంఘ సేవకుడు, యువకుడైన పుట్టి సందీప్ విషయం తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బడుగు బలహీన వర్గాల వారిని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం తన కర్తవ్యంగా భావిస్తున్నట్లు పుట్టి సందీప్ తెలిపారు.

## ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

### గిరిజన మోర్చ మాజీ మండల అధ్యక్షులు అనిల్‌నాయక్

**అక్కన్నపేట, జూన్30, ప్రభాతవార్త** మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలపై ఉన్నతాధికారు పర్యవేక్షణ లేక టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజన మోర్చ మాజీ మండల అధ్యక్షులు బానోతు అనిల్ నాయక్ అన్నారు.ఆదివారం మండల కేం ద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలో అధికంగా గిరిజన తండాలు ఉన్నాయని తండాల్లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ద్వార అందిచే పౌష్టికాహారాన్ని వారు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే విద్యార్థులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారాన్నిటీచర్లు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా సిడిపివో స్పందించి మండలంలోని అంగన్‌వాడీ సెంటర్‌లలో అకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్,రవిందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన రైతు భరోసా



రైతు భరోసా కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం, రైతులు

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త ః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రైతు భరోసా కార్యక్రమాన్ని ఆదివారం నాడు రామాయంపేట పట్టణంలోని సహకార సంఘం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీవో కరుణ, పిఏసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం పాల్గొని ప్రభుత్వం రైతులకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. రైతు భరోసా ముఖ్య ఉద్దేశంను వివరించారు. రైతు భరోసా ఏవిధంగా ఇవ్వాలో పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. 5 నుండి 10 ఎకరాల రైతులకు ఇవ్వాలని, పాన్‌కార్డు చూడకుండా, ఐటీ చూడకుండా, బీడు భూములు, రోడ్ భూములకు ఇవ్వకుండా సాగు భూములకు ఇవ్వాలని రైతులు కోరి తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో పుట్టి నర్సింలు, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ, సొసైటీ డైరెక్టర్‌లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రధాని మన్‌కీ బాత్‌ను వీక్షించిన బిజెపి నాయకులు



ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు

**నర్సాపూర్ జూన్ 30. ప్రభాతవార్త :** నర్సాపూర్ పట్టణంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఆదివారం దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి మన్ కీ బాత్‌కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్ వీక్షించడం జరిగింది. ఈ మన్‌కీ బాత్‌కార్యక్రమంలో దేశ ప్రదాన మంత్రి నరేంద్రమోడి సందేశాన్ని వారు శ్రద్ధగా తిలకించారు. ఈ మేరకు దేశ ప్రదాన మంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సబ్యులు మురళీయాదవ్ తో పాటు బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ హన్మంతు వెంకట రమణారావు, ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిది పాపగారి పెద్ద రమేశ్‌గౌడ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోద రాజెందర్, కౌన్సిలర్ లు సంగసాని సురేశ్, లతరమేశ్‌యాదవ్, బుచ్చేష్‌యాదవ్, పట్టణ ప్రదాన కార్యదర్శి బాలరాజు, ప్రధాన కార్యదర్శి బోర్‌వెల్ రామ్‌రెడ్డి, బిజెపి నాయకులు దేవేందర్‌యాదవ్, శంకర్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నహస్త మిత్ర బృందం చేయూత

**గజ్వేల్ టౌన్, జూన్ 30 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణానికి చెందిన ఆపన్నహస్త మిత్రం బృందం 91వ ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టడం జరిగింది. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఫకీర్‌బాబా(29) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. ఇతనికి ఉండడానికి ఇల్లు, భూమి ఎటువంటి ఆస్తులు లేవు. గ్రామ పెద్దల సహకారంతో ఒక స్థలంలో రేకుల షెడ్డు వేసుకొని తల్లి మీద ఆధారపడి జీవిస్తున్నారు. వీరి పరిస్థితిని తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం ఆదివారం గ్రామానికి వెళ్ళి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం అధ్యక్షుడు పాశికంటి బాల్‌చంద్రంతో పాటు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కరాటే స్పెషల్ క్యాంపులో విద్యార్థులతో మాస్టర్ హరిప్రసాద్

## రామాయంపేటలో విద్యార్థులకు కరాటే స్పెషల్ క్యాంపు

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 30, ప్రభాతవార్త ః** రామాయంపేట మున్సిపాలిటీలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం నాడు కరాటే స్పెషల్ క్యాంపు నిర్వహించారు. రెంజ్యుంకి షోటోకాన్ గ్రాండ్ మాస్టర్ బ్లాక్ బెల్టు 5వ డాన్ ఆధ్వర్యంలో ఈ స్పెషల్ క్యాంపు నిర్వహించినట్లు కరాటే గ్రాండ్ మాస్టర్ రొయ్యల హరిప్రసాద్ తెలిపారు. రామాయంపేట, నార్సింగి, నిజాంపేట మండలాల పరిధిలోని విద్యార్థులకు స్పెషల్ క్యాంపు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఇందులో ముఖ్యంగా మహిళలు తనకు తానుగా రక్షించుకోవడానికి ఎలా అనే దానిపై గ్రాండ్ మాస్టర్ రొయ్యల హరిప్రసాద్ విద్యార్థిని విద్యార్థులకు మెలకువలు నేర్పిం చారు. ఇందులో దాదాపు ఎనభై మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్యాంపులో బ్లాక్‌బెల్ట్ మాస్టర్స్ సంపత్ కుమార్, నాగరాజులు ఎగ్జామినర్స్‌గా వ్యవహరించారు. రామాయంపేట పట్టణంలో గత 20 సంవత్సరాలుగా ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని హరిప్రసాద్ సూచించారు.

## టీచర్ బదిలీల్లో ఎస్జీటీ ఖాళీలన్నీ చేపట్టాలి

### నేడు టీఆర్‌టిఎఫ్ నల్ల బ్యాడ్జీలతో నిరసన

### టీఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్‌కుమార్

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 30, ప్రభాతవార్త ః** ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జీటీ ఖాళీలన్నీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టిఎఫ్) ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టామని, కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ విజయవంతం చేయాలని టీఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నాడు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యా బదిలీల్లో ఎస్జీటీ తత్సమాన ఉపాధ్యా ఖాళీ పోస్టులన్నీ ఓపెన్ చేయాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ కమీషనర్‌కు టీఆర్‌టిఎఫ్ లేఖ సమర్పించిందన్నారు. పదోన్నతులలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందని, తిరిగి బదిలీలలో కూడా తీవ్ర నష్టం జరుగుతున్నదని, పరిశీలించి వెంటనే అన్ని ఖాళీలు బదిలీ పొందు ఉపాధ్యాయులకు చూపెట్టాలని కమీషనర్‌ను కోరామన్నారు. అంతే కాకుండా డీఎస్సీ ఉన్నందున మిగతా కాలేజీలలో నూతన ఉపాధ్యాయులు చేరే అవకాశం ఉన్నదని, ప్రస్తుతం సీనియర్ సర్వీస్ ఉపాధ్యాయులకు అన్ని ఖాళీలు చూపెట్టాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి పాఠశాలలకు ఉపాధ్యాయున్ని కేటాయిస్తానని చేసిన వాగ్దానానికి భిన్నంగా పాఠశాల విద్యాశాఖ వేకెన్సీలు చూపడం లేదని ఆయన పేర్కొన్నారు. ఎస్జీటీలకు జరుగుతున్న నష్టంపై నిరసన తెలియజేస్తూ సోమవారం నాడు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరౌతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి డి. మోహన్, రామాయంపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరాఫ్ ఇంద్రసేనాచారి, మెట్టు శేఖర్, నిజాంపేట మండల అధ్యక్షులు నవీన్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాల సంఘం నూతన అధ్యక్షునిగా శ్రీకాంత్

**హుస్నాబాద్‌రూరల్, జూన్30, ప్రభాతవార్త** హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో మాల సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం రోజున నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా మేకల శ్రీకాంత్(సిరి)ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీకాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను అధ్యక్షునిగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రానున్న రోజుల్లో గ్రామంలో సంఘం బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని,కులంలో ఎలాంటి సమస్య వచ్చినా పెద్దమనుషుల మధ్యనే పరిష్కరించే విధంగా వ్యవహరిస్తా మన్నారు. ఈ కార్యక్ర మంలో సంఘం సభ్యులు మేకల కనుకయ్య,పెంట స్వామి,రవి ,విషువర్ధన్, శంకరయ్య, సదానందం, రాములు, శ్రీనాథ్,సాయికుమార్ ,శ్రావణ్, సతీష్,సుధమల్ల రాజయ్య,ముద్దమల్ల కనుకయ్య,చంద్రయ్య,సొల్లు గాలయ్య,కిషన్,శంకర్,రంజిత్,లింగంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు ఇవ్వకుండా రైస్ మిల్లును సీజ్ చేయడం తగదు

### రైస్‌మిల్ యజమాని నోముల పాండురంగం

**నర్సాపూర్ జూన్ 30. ప్రభాతవార్త :** అకారణంగా తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎలాంటి సమాచారం లేకుండా సివిల్ సప్లయ్ అధికారులు నా రైస్ మిల్లును సీజ్ చేశారని నర్సాపూర్ మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ శివారులోని శ్రీమహాలక్ష్మి బిన్ని రైస్‌మిల్ యజమాని నోముల పాండురంగం అన్నారు.రైస్‌మిల్లు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ సివిల్‌సప్లయ్ అధికారులు అకారణంగా మార్చి 12 వ తేదీనా నా రైస్ మిల్లును సీజ్ చేశారని తెలిపారు.ఈ రైస్ మిలన సీజ్ చేయడంతో ఈ మిల్లులో పని చేస్తున్న 80 కుటుంబాలకు ఉపాధి పోయిందని దీంతో వారి బతుకులు రోడ్డు న పడ్డాయని అన్నారు. అయితే ఇటీవల అధికారులు నేను సిఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందంటు నా పై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపించారని తెలిపారు. దీంతో పరువు ప్రతిష్ట పోగా నేను మానసికంగా ఎంతో కృంగి పోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం బెయిల్ పై వచ్చాక నా రైస్ మిల్లులోని 350 క్వింటాళ్ళ బియ్యాన్ని తీసుకెళ్లారని ఆరోపించారు. సిఎంఆర్ బియ్యం కోసం ప్రభుత్వం కేసును నమోదు చేసి జైలుకు పంపిస్తే సీజ్ లో ఉన్న రైస్‌మిల్లునుండి బియ్యం ను తరలించడం ఎంత వరకు సమంజసమన్నారు. సిఎంఆర్ బియ్యాన్ని తప్పనిసరిగా ప్రభుత్వానికి చెల్లిస్తానని తెలిపారు. ఈ మేరకు సివిల్ సప్లయ్‌అధికారులు తన రైస్ మిల్‌ను ఎందుకు సీజ్ చేశారోతెలుపాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేగాక నా రైస్‌మిల్లు నుండి తీసుకుపోయిన బియ్యం లెక్కను తేల్చాలని ఆయన అన్నారు. ఈమేరకు తనకు న్యాయం జరిగేవరకు ఊరుకునేది లేదని కోర్టుకైనా వెళతానని రైస్ మిల్ యజమాని నోముల పాండురంగం తెలిపారు.

## నేడు హత్నూరకు ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి రాక

**హత్నూర జూన్ 30,.ప్రభాతవార్త** హత్నూరలో సోమవారం జరిగే వనమహోత్స కార్యక్రమంలో మొక్కలునాటే కార్యాక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గం శాసనసభ్యురాలు వాకిటి సునితాలక్ష్మారెడ్డి పాల్గోంటారని హత్నూర మండలం సోషల్ మిడియా ఇంచార్జ ఎం.విరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10గంటలకు జరిగే కార్యాక్రమంలో పార్టీ ప్రజాప్రతి నిధులు, పార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గోనాలని ఆయన కోరారు.

## 3న ప్రత్యేక మహాజన సభ

**మనూర్, జూన్ 30, ప్రభాతవార్త:** రైతు బంధు పథకం అమలుపై రైతు సంఘాల నుంచి సలహాలు సూచనల సేకరణ కొరకు జులై 3న మండల కేంద్రమైన మనూర్‌లోని సొసైటీ చైర్మన్ కే శ్రీకాంత్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అయ్యే కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా సహకార అధికారి హాజరవుతున్నారాన్నరు. కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు, ఉమ్మడి మనూర్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను తెలపాలని సొసైటీ చైర్మన్ కే శ్రీకాంత్ వివరించారు.

## రైతు భరోసాకై ప్రజాభిప్రాయ సేకరణ



రైతు భరోసాకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న అధికారులు

**ఝరాసంగం, జూన్ 30, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగం లోని సొసైటీ కార్యాలయంలో శనివారం రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సొసైటీ చైర్మన్ యండి గౌసోద్దిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఒఎస్‌డి శ్రీదర్, డిసిఓ నిర్మల, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కాగా 60 మంది రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పంటలను సాగు చేస్తున్న 10 ఎకరాలు ఉన్న వారందరికి రైతు భరోసా అందించాలని రైతులు అభిప్రాయ పడ్డారు. రైతుల అభిప్రయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్, ఎంపిపి అధ్యక్షులు కటికె దేవదాస్‌లు పాల్గొన్నారు.

## నార్కోటిక్‌పై విద్యార్థులకు అవగాహన

**సిర్గాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు పోలీసులు నార్కోటిక్‌పై అవగాహన కల్పించారు. ఎఎస్ఐ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నార్కోటిక్, యాంటీ డ్రగ్స్‌తో కలిగే చెడులను వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారి భవిష్యత్తు బూడిలో పోసిన పన్నీరులా మారుతుందని, అందుకు క్రమ శిక్షణతో జీవనం సాగిస్తే భవిష్యత్తు బంగారు మయం కావడం తథ్యమన్నారు. మత్తు పదార్థాలతో కలిగే చెడులను తమ కుటుంబీకులకు సైతం వివరించాలని ఎఎస్ఐ రవీందర్‌గౌడ్ సూచించారు.

## 10 ఎకరాలోపు రైతు భరోసా అందించాలి

### అభిప్రాయ సేకరణలో రైతుల సూచన

**సిర్గాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:** 10 ఎకరాలు గల రైతులందరికి (సాగులో ఉన్నభూమి) రైతు భరోసా అందించాలని రైతులు అభిప్రాయ పడ్డారు. మండలంలోని బొక్కస్ గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ గుండు వెంకటరాములు అధ్యక్షతన రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న భూమికి మాత్రమే రైతు బరోసా అందించాలని, పడావు భూములకు రైతు బంధు అంధించవద్దని రైతులు సూచించారు. కార్యక్రమంలో డిసిఓ తుమ్మ ప్రసాద్, అధికారులు చిన్నారావు, శేషగిరిరావు, మాధవి, అరుణ, సీఈఓ సతీష్, అజయ్, రైతులు పాల్గొన్నారు.

## వేం నరేందర్‌రెడ్డిని కలిసిన చక్రధర్‌గౌడ్



ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన చక్రధర్‌గౌడ్

**సిద్దిపేట అర్బన్, జూన్ 30, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వే ం నరేందర్‌రెడ్డిని హైదారాబాద్‌లో అదివారం సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ గాదగోని చక్రధర్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై చర్చించారు.

## సజావుగా వీరసేన అగమ పాఠశాల ప్రవేశ పరీక్ష



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఈవో బాలాజీ

**కొమురవెల్లి, జూన్ 30, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలో వీరశైవ అగమ పాఠశాలలో ప్రవేశం పొందేందుకు కొమురవెల్లి మల్లన్న అలయ అధ్వర్యంలో అదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా ప్రశాంతంగా ముగిసింది. మల్లన్న అలయంలో పాలకాల మండలి కార్యాలయంలో వీరశైవ అగమ పాఠశాలలో మూడు యేండ్ల పాటు అగమ విద్యను నేర్చుకునేందుకు మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అలయ ఈవో బాలాజీ అధ్వర్యంలో నిర్వహించిన అడ్మిషన్ టెస్ట్‌లో విద్యార్థులు పాల్గొన్న పరీక్ష విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేద పాఠశాల అధ్యాపకులు వీరేశలింగం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మున్సిఫల్ చైర్మన్

**నర్సాపూర్ జూన్ 30. ప్రభాతవార్త :** నర్సాపూర్‌పట్టణంలోని పలువురు బాధిత కుటుంభ సభ్యులను నర్సాపూర్‌మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కటుంభ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈమేరకు నర్సాపూం ్మున్సిపాలిటీ పరిధిలోని 5 వ వార్డులో గల సాదుల రాజలింగం బార్య అయిన సాదుల సుగుణమ్మ కుటుంభ సభ్యులను అదేవిదంగా 1 వార్డులోగల గొల్లరాజు తల్లి లక్ష్మి మరణించినందున దవారి కుటుంభ సభ్యులను పరామర్శించడం జరిగింది.అంతేగాక నర్సాపూర్‌మున్సిపాలిటీ లో వార్డు అధికారిగా విధులు నిర్వహిస్తున్న పట్లోళ్ళ మహేందర్‌రెడ్డి కుమారుడు పట్లోళ సంతోష్‌రెడ్డి రోడ్డు ప్రమాందలో మృతి చెందినందున ఆ కుటుంభ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం పొందిన పట్లోళ్ళ సంతోష్‌రెడ్డి స్వంత గ్రామం కొల్చారం మండలం మాందాపూర్ గ్రామానికి వెళ్ళి అంత్య క్రియల్లో పాల్గొన్నారు.ఈ సందర్బంగా మున్సి ఫల్‌చైర్మన్ బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మున్సిఫల్ మేనేజర్ మధుసూధన్,శానిటెరి ఇన్స్ ఫెక్టర్ సల్లమురళీమోహన్, వార్డు అధికారులు మున్సిఫల్ సిబ్బంది తదితరులున్నారు.



# బండ్లగూడలో భగ్గుమన్న రాజకీయ విభేదాలు

- ఎమ్మెల్యే ముందే తాజా, మాజీ మేయర్ల అనుచరుల ఘర్షణ
- భౌతిక దాడులు చేసుకున్న ఇరు వర్గాలు
- తమపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇద్దరు కార్పొరేటర్లు
- తమపై దాడి చేసి ఫిర్యాదు చేశారంటున్న బిఆర్ఎస్ కార్యకర్తలు

**నార్సింగి, జూన్ 30 ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో వన మహోత్సవం కార్యక్రమం సాక్షిగా తాజా, మాజీ మేయర్ల అనుచరుల మధ్య ఘర్షణ జరిగింది. ఫోటోలకు అడ్డు పడుతున్నారంటూ మేయర్ లతాగౌడ్ అనుచరులు మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ అనుచరులను పక్కకు జరుగాలని సూచించారు. ఇది కాస్త మాటా మాట పెరిగి పెద్దదిగామారి ఇరువురి అనుచరులు ఒకరిపై మరొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. మాజీ మేయర్ అనుచరుడైన హరీష్‌గౌడ్‌కు, కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డిలకు స్వల్పంగా గాయాలయ్యాయి. మరో దళిత కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ షర్ట్ చిరిగిపోయింది. ఈ తతంగమంతా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలోనే జరిగింది. పరిస్థితి చేయి దాటిపోతుందని గమనించిన పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాలను చెదరగొట్టి, పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. అనంతరం కార్పొరేటర్లు చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డిలు తమపై దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాపైనే మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అనుచరులు దాడులుచేసి, రక్తం కారేలా కొట్టి మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారని బిఆర్ఎస్ నాయకుడు హరీష్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పార్టీల మధ్య గొడవ కాదని, వ్యక్తిగతంగా నన్ను టార్గెట్ చేసుకొని దాడిచేశారన్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? గతంలో చంపుతామని బెదిరించారని, ఇప్పుడు దాడిచేసి గాయపరిచారన్నారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, అక్రమాలను వెలికి తీయడం ఆపేది లేదని, ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి విడిపించేంత వరకు నిద్రపోయేది లేదని స్పష్టం చేశారు. అకారణంగా నన్ను గాయపరిచారని, వీరితో నాకు ప్రాణహాని ఉందని, నాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదుచేశానని వివరించారు. పోలీసుల ముందే నీ అంతు చూస్తామని, తుకుడలు తుకుడలు చేస్తామని హెచ్చరిస్తున్నారని తెలిపారు. అనంతరం కార్పొరేటర్లు చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ అవిశ్వాసం సమయంలో మహేందర్‌గౌడ్‌కు కాకుండా లతాగౌడ్‌కు మద్దతు తెలుపడంవల్లే మాపై కక్షకట్టి ఇలా భౌతిక దాడులు చేశారని ఆరోపించారు. మాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు.

**నాపట్ల దురుసుగా ప్రవర్తించారు : మేయర్ లతాగౌడ్**

వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో నా పట్ల మాజీ మేయర్ మహేందర్ గౌడ్ అనుచరులు దురుసుగా ప్రవర్తించారని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. దీన్ని గమనించిన తోటి కార్పొరేటర్లు ఇదేమిటని ప్రశ్నిస్తుండగానే వారిపై మాజీ మేయర్ అనుచరులు ఒక్కసారిగా దాడి చేసి, గాయపరిచారన్నారు.

అవిశ్వాసం సమయంలో మద్దతు తెలుపలేదన్న కక్షతోనే ఈ రోజు మా కార్పొరేటర్లపై భౌతిక దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. కార్పొరేటర్లపై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామన్నారు. మహేందర్ గౌడ్ మేయర్‌గా ఉన్నప్పుడు ఒక్కసారి కూడా మేము ఇలా చిల్లర దాడులు చేయలేదని లతాగౌడ్ పేర్కొన్నారు.

# శంకర్‌యాదవ్ మృతి కార్మిక లోకానికి తీరని లోటు

**సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**కంటోన్మెంట్, జూన్ 30 ప్రభాతవార్త:**
బోయిన్‌పల్లి మోండా మార్కెట్‌లకు అధ్యక్షులు గా తలసాని శంకర్‌యాదవ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషిచేశారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తలసాని శంకర్‌యాదవ్ జ్ఞాపకార్థం ఆది వారం బోయిన్‌పల్లి మార్కెట్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద పలువురు నేతలు నివాళులర్పించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ మార్కెట్‌లోని వర్తకులకు, కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా శంకర్‌యాదవ్ అండగా ఉండి పరిష్కారానికి కృషి చేసేవారని అన్నారు.

ఆయన మృతి కార్మిక లోకానికి తీరనని లోటు ఏర్పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ వెజిటేబుల్ కమీషన్ ఏజెన్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు సోమ దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మిర్యాల శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రారెడ్డి, కోశాధికారి టి.క్రిష్ణ, డిసిఎం యూనియన్ అధ్యక్షుడు ఇరుముల్ల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, నాయకులు జనార్ధన్, బీరయ్య, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ డైరెక్టర్లు గిరిధర్, సిహెచ్.బాలమల్లు, బిఆర్ఎస్ నాయకులు గజ్జెల నాగేశ్, నర్సింగ్ యాదవ్, మహేశ్‌యాదవ్, ధర్మేందర్‌యాదవ్, స్కైలాబ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కొలువులు తగ్గాయ్.. కోతలు పెరిగాయ్..

**నగరంలోని ఐటీ ఉద్యోగుల్లో గుబులు**



**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త**
ఐటీ సంస్థల్లో ఉద్యోగాల కోతలు గుబులురేపుతోంది. కోవిడ్ సమయంలో ఐటీ సేవలకు డిమాండ్ పెరగడంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్నాయి. భారీ ప్యాకేజీలను ఆఫర్ చేశాయి. దాదాపు రెండేళ్ల పాటు ఐటీబూమ్ నడిచింది. ఇప్పుడు పరిస్థితులు అంత ఆశాజనకంగా లేవు. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా అమెరికా,యూరోప్‌లో ఆర్థిక మందగమన భయాలతో ఐటీ సంస్థలు ఉద్యోగాల్లో కోతలు పెడుతున్నాయి. ఈ పరిణామాలు నగరంలోని ఐటీ ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఐటీ ఉద్యోగాల్లోనూ పలురకాల నియామకాలు ఉన్నాయి. నేరుగా కంపెనీ పేరోల్స్‌పై పనిచేస్తున్న ఉద్యోగులు కొందరైతే కాంట్రాక్ట్ ఉద్యోగులుగా నిర్ణీత ప్రాజెక్ట్ కోసం పనిచేసేవారు మరికొందరు. లేఆఫ్‌ప్రభావం ఎక్కువగా కాంట్రాక్ట్ ఐటీ ఉద్యోగులపై ఉంది. కొత్త ప్రాజెక్టులు తగ్గిపోవడంతో వీరి కొలువులు ఊడుతున్నాయి. అయితే ఈ ప్రభావం ఇంకా హైదరాబాద్‌లో లేదని.. ఉద్యోగాలు కోల్పోయిన దాఖలాలు ఇప్పటివరకు కన్పించలేదని ఒక ఐటీ సంస్థలో పేరోల్ విభాగంలో పనిచేసే ప్రతినిధితో అన్నారు.బహుళజాతి సంస్థలైన మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్, గూగుల్, దేశీయ సంస్థలు విప్రో, స్విగ్గీ తదితర కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వీరికున్న కార్యాలయాల్లో 5శాతం దాకా ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఈ సంస్థలకు అమెరికా బయట ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్నది హైదరాబాద్‌లోనే కావడంతో సహజంగానే కోతల ప్రభావం ఉంటుందని కలవరడపతున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం వరకు నియామకాల్లో వృద్ధి కన్పించినా.. ఆ తర్వాత క్రమంగా కంపెనీలు కొత్త నియామకాలను పూర్తిగా ఆపేశాయ్. ఉన్న ఉద్యోగులనే సర్దుబాటు చేస్తున్నాయి. వర్క్ ఫ్రంహోం క్రమంగా ఎత్తేస్తున్నాయి. ఓ కంపెనీ నచ్చి ఉద్యోగానికి సరే అన్నాను. కానీ వారు బెంగళూరులో పనిచేయాలంటున్నారు. దీంతో వదులుకున్నాను. బయట పరిస్థితులు చూస్తుంటే కొంత ఆందోళనగా ఉంది అని ఐటీ రంగంలోని ఉన్నత ఉద్యోగి శ్రీకాంత్ అన్నారు.

**తాత్కాలికమే...**

**బుర్ర వెంకటేశ్వర్లు, ఐటీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్**

అంతర్జాతీయంగా లేఆఫ్‌ల ప్రభావం మనమీద కన్పించినా అది తాత్కాలికమే దీర్ఘకాలికంగా ఇది మనకు మేలు చేస్తుంది. యూకే, యూఎస్‌లో రెండు ఉద్యోగాలుతీసేస్తే.. ఇక్కడ నాలుగు ఉద్యోగాలు వస్తాయి. కొత్తవారికి ఎక్కువ అవకాశాలు వస్తాయి. టాప్ లెవల్‌లో ఉండే ఉద్యోగుల వేతనాలు ఎక్కువ కాబట్టి వీరి ఉద్యోగాలు కొన్ని పోయే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అక్కడ వచ్చింది కూడా సాఫ్టవ క్రైసిస్ కాబట్టి మనపై ఎక్కువ ప్రభావం ఉండదు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణకు భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. కొత్త ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. మారుతున్న టెక్నాలజీలకు తగ్గట్టుగా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

# జిహెచ్ఎంసిలో విలీనం కానున్న కంటోన్మెంట్



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

**కంటోన్మెంట్,జూన్ 30 ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్నీ జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని కొన్ని సంవత్సరాల నుంచి స్థానిక ప్రజలు ఒత్తిడి తెస్తున్నప్పటికి ఫలితం లభించలేదు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో విలీనంచేస్తే పౌర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. మిలటరీ, ఆర్మీ స్టేషన్లను మినహాయించి పౌర (సివిలియన్) ప్రాంతాలను జిహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. ఈ అంశంపై సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గత మార్చి 5న రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన ప్రధాని మోదీని స్వాయంగా కలిసి బ్రిటీషు కాలం నుంచి కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డు లన్నింటీని రద్దు చేసి స్థానిక పురపాలక సంఘాలు పట్టణ మున్సిపాల్టీల్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని సమావేశాలు జరిపారు. కంటోన్మెంట్‌లోని రక్షణశాఖ భూములు, బి-3 బంగ్లా స్థలాలు, లీజ్‌లు, గ్రాంట్‌లు, ఆస్థుల పై యాజమాన్యపు హక్కులు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు, అప్పులు, ఆస్థులపై జిహెచ్ఎంసీలో బదిలీ చేయబడుతాయి. సవిల్ ప్రాంతాలను ఫ్రీ ఓల్డ్ చేయాలని నిర్ణయించారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో బి-2సివిల్ ఏరియా 2676 ఎకరాలు ఉన్నాయి. నోటిఫైడ్ సివిల్ ఏరియాలో 235 ఎకరాల స్థలాలు ఉన్నాయి. గతంలో సిఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడే కంటోన్మెంట్ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పౌర ప్రాంతాలను జిహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని రక్షణ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ హేమంత్ యాదవ్ గత నెల 28న బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు ఉత్తర్వులు జారీ చేశారు.

# బూత్‌స్థాయి నుంచి పార్టీ పటిష్టానికి కృషి చేయాలి: మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**పంజగుట్ట జూన్ 30 (ప్రభాతవార్త):**
భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్ట పరచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షులు,కోర్డినేటర్‌ల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాయకులు ఎపుడూ అందుబాటులో ఉండాలన్నారు, బీజేపీ నాయకత్వం ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు పోతుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా కేసీఆర్ తరహాలోనే ముందుకు పోతుందని, త్వరలోనే ప్రజలు వాస్తవాలు గ్రహిస్తారన్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమంలో ఆయన స్థానిక నేతలతో కలసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. కార్యమ్రంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రాంచంద్రా రెడ్డి, బీజేపీ నేతలు బంగారు శృతి, అమర్నాద్, సుభాష్, గౌతమ్,రాఘవరెడ్డి,వినయ్, వీణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా...**

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త :**
సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలో బిజెపి గెలవడంలో అంబర్‌పేట్ నియోజక వర్గం కీలక పాత్రను పోషించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

అనంతరం బిజెపి నగర కార్యాలయంలో ఆదివారం జరిగిన అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ సమావేశానికి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ అంబర్‌పేట అసెంబ్లీ నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అదే విదంగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా. ఎన్.గౌతమ్ రావు మాట్లాడుతూ బిజెపిని మరింత పటిష్టం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కృష్ణ యాదవ్, బిజెపి నాయకులు ఆనంద్ గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, అజయ్‌కుమార్, శ్యామ్ రాజ్, రమేష్ యాదవ్, నందకిషోర్, కోర్పోరేటర్లు అమృత, ఉమారమేష్ యాద్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం : తలసాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**కంటోన్మెంట్, జూన్ 30 ప్రభాతవార్త:**
ప్రతి ఏటా ఆషాడమాసంలో బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, అందుకు ఆలయాల వద్ద భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్టీ శ్రేణులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. ఆదివారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో సనత్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా అభివృద్ధి పనులుకుంటు పడ్డాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో పోరాడాలన్నారు. ఆషాడ మాసం అనంతరం పాదయాత్రకు రూపకల్ప చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్ శేషుకుమారి, బిఆర్ఎస్ నాయకులు అత్తేల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరిక్రిష్ణ, హన్మంత్ రావ్, వెంకటేశన్ రాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంలో పక్కా నిర్మాణాలు..

- పట్టా స్థలం మాటున ప్రభుత్వ స్థలం కబ్జా
- 11 ఎకరాలలో అక్రమ నిర్మాణాలు
- నిర్మాణాల వెనుక ఓ అధికారి హస్తం
- గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్ కార్యాలయం వెనుకాలే తతంగం



సర్వేనంబర్ 156 ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న పలు నిర్మాణాలు

**దుండిగల్, జూన్ 30 ప్రభాతవార్త:**
పట్టా స్థలాల మాటున ప్రభుత్వ స్థలాలను కబళిస్తున్నారు. పట్టపగలే ప్రభుత్వ స్థలంలో పక్కా నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రణాళిక బద్ధంగా, యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న కబ్జాల పర్వం తహసీల్దార్ కార్యాలయం వెనకాలే కావడం గమనార్హం. పదుల సంఖ్యలో నిర్మాణాలు చోటు చేసుకుంటున్న, ఫిర్యాదులు వెల్లువెత్తిన అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వ స్థలం కబ్జాల వెనుక రెవెన్యూ కార్యాలయంలోని ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది.తన కిందిస్థాయి సిబ్బందితో వసూళ్లకు పాల్పడుతూ నిర్మాణాలకు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అడ్డంకి లేకుండా నిర్మాణాలు కొనసాగుతుంటే సదరు అధికారిపై వస్తున్న విమర్శలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. రూ. 100కోట్లకు పైగా విలువ చేసే 11 ఎకరాల ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమాలలో రెవెన్యూ యంత్రాంగంతో పాటు రిజిస్ట్రేషన్, మున్సిపల్‌శాఖలు సైతం పాలుపంచుకుంటున్నాయి. వివరాల్లోకి వెళితే... మేడ్చల్‌జిల్లా, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి పరిధి సర్వే నంబర్ 156లో 11.04 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. 1981లో కొందరూ రియల్టర్లు సర్వేనంబర్ 158,159,161లలోని పట్టా స్థలంతోపాటు సర్వే నంబర్ 156 ప్రభుత్వ స్థలం, సర్వేనంబర్ 160 పోరంబోకు స్థలంసైతం ప్లాట్లుగా మార్చి లేఅవుట్ చేశారు. నాటి నుండి క్రయ విక్రయాలు జరుగుతుండగా 2011లో విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో నాటి తహసీల్దార్ 22-ఎ ప్రకారం సర్వేనంబర్ 156లో 11.04 ప్రభుత్వ స్థలం, 160లో 4.03ఎకరాల పోరంబోకు స్థలం ఉందని రిజిస్ట్రేషన్‌లు నిలుపదల చేయాలని ఎస్ఆర్‌వోకు లేఖ ద్వారా కోరారు. దీంతో రిజిస్ట్రేషన్ శాఖ సర్వేనంబర్ 156,160లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ప్రొహైబిటెడ్ లిస్టులో చేర్చడంతో రియల్టర్లు మరో పథకానికి తెరలేపారు. సర్వేనంబర్ 156,160లను తప్పించి కేవలం సర్వేనంబర్ 158,159,161లను చూపుతూ రిజిస్ట్రేషన్లు చేయడం మొదలుపెట్టారు. నేటి వరకు ఇదే తరహా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి.

**రిజిస్ట్రేషన్లు పట్టా స్థలంలో..**
**నిర్మాణాలు ప్రభుత్వ స్థలంలో...**

ఎలాగైనా ప్రభుత్వస్థలాన్ని కాజేయాలని భావించిన కొందరూ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. తమ అసమాన చతురతతో పాటు అవినీతి అధికారుల సలహాలు, సూచనలతో వివిధ దారుల్లో ముందుకు వెళ్తూ కబ్జాల పర్వం కొనసాగిస్తున్నారు. సర్వేనంబర్ 156, 160లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో 158, 159, 161లను మాత్రమే పొందుపరిచి రిజిస్ట్రేషన్లు జరిపిస్తున్నారు. అవే నంబర్లతో టిఎస్‌బిపాస్‌లో ధరఖాస్తు చేసుకొని అనుమతులు పొందుతున్నారు. పట్టా స్థలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగియడంతో మున్సిపల్ అనుమతులు పొందిన తరువాత నిర్మాణాలు మాత్రం సంపూర్ణంగా ప్రభుత్వ స్థలంలోనే చేపడుతున్నారు.

ఇప్పటికే మున్సిపల్ నుండి సుమారు 25మంది అనుమతులు పొంది ప్రభుత్వ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్ నుండి నాలుగు అంతస్థుల వరకు నిర్మాణాలను శరవేగంగా కొనసాగిస్తున్నారు.

**రెవెన్యూ సర్వే ప్రకారం...**

గతంలో సర్వేనంబర్ 156లోని ప్రభుత్వస్థలంలో నిర్మాణాలు జరుగుతున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో పరిశీలించేందుకు వెళ్లిన అధికారులకు క్రయవిక్రయదారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పట్టా స్థలం అని అధికారులతో వాదనకు దిగడంతో సదరు లేఅవుట్‌కు సంబంధించి సర్వే చేశారు. రెవెన్యూ సర్వేప్రకారం సర్వేనంబర్ 156లోని లేఅవుట్‌లోని ప్లాట్లు 27నుండి31, 51నుండి58, 61నుండి72, 82నుండి94, 97నుండి112, 117నుండి131, 134నుండి146, 153నుండి167, 169నుండి 190, 193నుండి203, 206నుండి213, 216 నుండి224 వరకు, సర్వేనంబర్ 160లో 1,2 115, 116, 148నుండి152, 225నుండి228 వరకు ఉన్నట్లుగా నిర్ధారించారు. ఈ ప్లాట్లు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేశారని ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

**అడ్డంకి లేకుండా అధికారి హస్తం.....**

సర్వేనంబర్ 156 ప్రభుత్వ స్థలంలో నాటి రెవిన్యూ అధికారులు కఠినంగా హెచ్చరికలు జారీ చేయడంతోపాటు నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేస్తామని పేర్కోనడంతో నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరు సాహసించలేదు. అయితే ఇటీవలకాలంలో కొందరు అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ నిర్మాణదారులకు సలహాలు ఇస్తూ నిర్మాణాలకు సహకరిస్తున్నారు. ప్రభుత్వస్థలంలో జోరుగా జరుగుతున్న నిర్మాణాలవెనుక రెవెన్యూ కార్యాలయంలోని కీలక ఉద్యోగి కీలకంగా వ్యవహరిస్తున్నారు. కూర్చున్న చోటనే సెటిల్‌మెంట్లు చేయడం ఆయన వెన్నతో పెట్టిన విద్య.అవినీతికి నిలువెత్తు నిదర్శనంగా ఉండే కిందిస్థాయి సిబ్బంది ఒకరిని ఆయనకు బంటుగా మార్చుకొని ఒక్కో నిర్మాణం నుండి రూ. 3 లక్షల నుండి రూ.5 లక్షల వరకు వసూళ్లుచేస్తున్నట్లు స్థానికం గా తెలుస్తుంది. దీంతోనే ఎటు వంటి చర్యలు లేకుండా ప్రభుత్వస్థలంలో గ్రౌండ్ ఫ్లోర్ మొదలుకొని నాలుగు అంతస్థులవరకు నిర్మాణాలు కొనసాగుతున్నట్లు పలువురు అభిప్రాయ పడుతున్నారు.

**నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాము**

**తహసీల్దార్ సయ్యద్ మతీన్**

సర్వేనంబర్ 156 ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, విమర్శలపై ప్రభాతవార్త ప్రతినిధి తహసీల్దార్ సయ్యద్ మతీన్ దృష్టి తీసుకెళ్లగా ఈవిధంగా స్పందించారు. సర్వే నంబర్ 156లోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలపై తన దృష్టికి వచ్చిందన్నారు. సర్వేనంబర్ 158, 159,160లను పొందుపరిచి రిజిస్ట్రేషన్లు చేసుకోవడంతో సదరు దృవపత్రాలనుచూపి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నట్లు గమనించాం. గతంలో నిర్వహించిన సర్వేఆధారంగా పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం. ప్రభుత్వ స్థలం పరిధి జారీ చేసిన అనుమతులను రద్దు చేయాలని మున్సిపల్ అధికారులకు లేఖ పంపుతాము. అక్రమ నిర్మాణాలపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాము. అదే విధంగా మా సిబ్బంది ఎటువంటి అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కోన్నారు.

# గోల్కొండ బోనాలకు రావాలంటూ గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానిస్తున్న భగవంత్‌రావు

**మెహిదీపట్నం, జూన్ 30, ప్రభాతవార్త :**
ఈనెల 7న గోల్కొండ బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతుండడంతో బోనాల ఉత్సవాల మొదటి పూజకు రావాలంటూ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌కు భాగ్యనగర్ బోనాల ఉత్సవాల కమిటీ, గోల్కొండ దేవాలయ ప్రొఫెషనల్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల సమితి అధ్యక్షులు భగవంత్‌రావు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆహ్వానించిన వారిలో రాహుల్ స్వాగత్, రాజు, సాయిబాబచారి, బాబురావు, యాదగిరి చారి, వీరుసింగ్‌లు ఉన్నారు.

# మీర్‌పేట్ పిఎస్ పరిధిలో సెక్టార్ ఇన్‌ఛార్జిల నియామకం

**సరూర్‌నగర్, జూన్ 30 ప్రభాతవార్త:**
మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెక్టార్లకు ఇంఛార్జిలుగా ఎస్ఐలను నియమించినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ధాతునగర్, లెనిన్‌నగర్ సెక్టార్‌కు ఎస్ఐ కె.సుధాకర్, నందనవం, గాయత్రీనగర్ సెక్టార్‌కు రాజశేఖర్, అల్మాస్‌గూడ, టీచర్స్ కాలనీ సెక్టార్‌కు జి.శ్రీనివాస్‌రెడ్డి, గుర్రంగూడ సెక్టార్‌కు ఎ.రాజు, బడంగ్‌పేట్ సెక్టార్‌కు డి.రాంబాబులను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా సెక్టార్ల పరిధి కిందకు వచ్చే ప్రాంతాల్లోని ప్రజలు శాంతి భద్రతల విషయంలో గానీ ఇతర సమస్యలపై వారిని సంప్రదించవచ్చని ఆయన సూచించారు. పిఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు : కౌన్సిలర్

**దుండిగల్, జూన్ 30 ప్రభాతవార్త:**
ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కౌన్సిలర్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఇంటి స్థలం ఆక్రమించారంటూ ఆయనపై కొందరూ ఆరోపణలు చేసిన నేపథ్యంలో కౌన్సిలర్ మాట్లాడుతూ మాతండ్రి ద్వారా మాకు సంక్రమించిన ఇంటిలో కొన్ని సంవత్సరాలుగా అందులో నివాసం ఉంటూ పన్నులు చెల్లిస్తూ వచ్చాము. ఇల్లు శిథిలావస్తకు చేరుకోవడంతో పాటు రహాదారికి దిగువ ఉన్నందున్న వర్షాకాలంలో ఇంట్లోకి వరద నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడేవాళ్ళం. దీంతో మేము మాపాత ఇంటిని తొలగించి అదే స్థానంలో నూతన ఇల్లు నిర్మించుకుంటున్నాము. నిర్మాణం తుది దశకు చేరుకున్నది. ఈసమయంలో ఎవరో వచ్చి నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఆరోపణలు చేయడం సరికాదు. నేను ఎటువంటి ఆక్రమణలకు పాల్పడలేదు.

ఆక్రమణలకు పాల్పడినట్లు ఆధారాలు చూపాలని, తన ఎదుగుదలను ఓర్వలేక డబ్బులు లాగేందుకు దుష్ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. కొందరూ రాజకీయంగా, వ్యాపారంగా నాపై కుట్రపూరిత చర్యలు పాల్పడుతున్నారని ఇటువంటివి తగవని హెచ్చరించారు.